కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని | తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :130 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | ఆదివారం 06-09-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

## నువ్వో 'బోడి టీచర్'... ఎమ్మెల్యే కవ్వంపల్లి వివాదాస్పద వ్యాఖ్యలు

తిమ్మాపూర్ : అసలే ఈరోజు ఉపాధ్యాయ దినోత్సవం అందులో అందరికీ విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులందరూ సంతోషంగా జరుపుకునే ఉపాధ్యాయ దినోత్సవం సాక్షిగా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మరోసారి ఉపాధ్యాయుల వృత్తిని కించపరిచే విధంగా మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ లోని అరుంధతి కళ్యాణ మండపంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తో పాటు షాడో ఎమ్మెల్యే ల పట్ల దుమ్మెత్తి పోస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ను విమర్శిస్తూ ఆఫ్టాల్ బోడి టీచర్ రసమయి బాలకిషన్ అంటూ వివాస్పద వాఖ్యలు చేశారు. నువ్వు ఎమ్మెల్యే కాకముందు గోసి గొంగడి తో వచ్చావని, బోడి టీచరు ఉద్యోగం చేశావని.. ఎమ్మెల్యే అయిన తర్వాత కొన్ని వేల ఆస్తులు ఎలా వచ్చాయని విమర్శించారు. ఆయన చేసిన వాక్యాలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఉపాధ్యాయ వర్గాల నుండి విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉపాధ్యాయ దినోత్సవం రోజున వేరే వారిని విమర్శించబడి ఉపాధ్యాయ వృత్తిని విమర్శించడం



ఏంటని ప్రశ్నిస్తున్నారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఇటీవల ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నిలదీస్తున్నడంతో ఆయన ఫ్రస్టేషన్ లో ఏం మాట్లాడుతున్నాడో అర్థం కావడం లేదని, డాక్టర్ అయ్యుండి మరో డాక్టర్కు చూపించుకోవాలని పలువురు చర్చించుకోవడం చర్చానీయాంశంగా మారింది.

## సురేఖను కాపాడేందుకు చాలా ప్రయత్నించాం...

హైదరాబాద్, సెప్టెంబర్ 5: తెలంగాణలో కొండా సురేఖ బర్తరఫ్ అంశం సంచలనం రేపిన విషయం తెలిసిందే. మంత్రివర్గం నుంచి సురేఖ తొలగింపు, ఢిల్లీలో జరిగిన పరిణామాలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. ఈరోజు(శనివారం) మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. సురేఖను కాపాడేందుకు తీవ్రంగా ప్రయత్నించామని తెలిపారు. సురేఖ విషయంలో అందరం తమ వంతు ప్రయత్నం చేసినట్లు చెప్పారు. కొండా సురేఖ బర్తరఫ్ పూర్తిగా ఏఐసీసీ నిర్ణయమని.. ఆమె విషయంలో హైకమాండ్ ఒప్పుకోలేదని టీపీసీసీ చీఫ్ అన్నారు. ఇక, క్యాబినెట్ విస్తరణపై మాట్లాడిన మహేశ్.. ఇప్పట్లో మంత్రివర్గ విస్తరణ లేనట్లే అని స్పష్టం చేశారు. ఢిల్లీలో క్యాబినెట్ విస్తరణపై చర్చ జగలేదన్నారు. కేవలం కొండా సురేఖ, చిన్నా రెడ్డి అంశంపైనే చర్చ జరిగినట్లు చెప్పుకొచ్చారు. క్యాబినెట్ విస్తరణపై హైకమాండ్ నుంచి ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. క్యాబినెట్ విస్తరణ ఎప్పుడు చేయాలనేది సీఎం రేవంత్ రెడ్డి ఇష్టమన్నారు. 'నాకు మంత్రి పదవి అన్న ప్రచారంపై సమాచారం లేదు' అని వెల్లడించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్



గాంధీ ఆశయాన్ని రేవంత్ నెరవేర్చారని టీపీసీసీ చీఫ్ అన్నారు. కుల సర్వే శాస్త్రీయంగా చేశామని తెలిపారు. రాబోయే వంద రోజులు దేశ వ్యాప్తంగా బీసీ హక్కుల గర్జన చేస్తామన్నారు. బీసీ హక్కుల కోసం జరిగే గర్జనను విజయవంతం చేయాలని మహేశ్ గౌడ్ పిలుపునిచ్చారు.

## హల్ద్వానీ 'శుద్ధీకరణ' వివాదం - బీజేపీ నేతలపై 'జీరో ఎఫ్ఐఆర్' నమోదు



న్యూఢిల్లీ,ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మరియు రాజ్యసభ విపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన సభా వేదికను 'శుద్ధీకరించిన' ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. దళిత నాయకుడైన ఖర్గే పాల్గొన్నందునే ఆ ప్రాంతం అపవిత్రమైందనే నెపంతో ఈ చర్యకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, కాంగ్రెస్ నాయకులు చట్టపరమైన పోరాటానికి దిగారు. ఆగస్టు 8న ఉత్తరాఖండ్‌లోని నైనిటాల్ జిల్లా హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో ఖర్గే నేతృత్వంలో శాంతియుతంగా బహిరంగ సభ జరిగింది. ఖర్గే ఎస్సీ వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో, ఆయన సభా స్థలాన్ని బీజేపీ నేతలు శుద్ధీకరించారని ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ ఎస్‌టీ విభాగం మాజీ వైస్ ఛైర్మన్ టీఆర్ రామప్ప బెంగళూరులోని విధాన సౌధ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఆగస్టు 31న బెంగళూరు పోలీసులు ఉత్తరాఖండ్ బీజేపీ నేతలు మరియు ఇతరులపై 'జీరో ఎఫ్ఐఆర్' నమోదు చేశారు. అనంతరం తగిన విచారణ నిమిత్తం ఈ కేసును ఉత్తరాఖండ్‌లోని సంబంధిత పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు.రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ఒక దళిత అగ్రనేత ప్రసంగించిన ప్రదేశాన్ని 'అపవిత్రం' అయినట్లుగా చిత్రీకరించి శుద్ధి చేయడం తీవ్ర అవమానకరమని కాంగ్రెస్ వర్గాలు మండిపడ్డాయి.: ఈ చర్య ప్రత్యక్షంగా అంటరానితనాన్ని ప్రోత్సహించడమేనని, ఎస్సీ/ఎస్టీ (అట్రాసిటీ నిరోధక) చట్టం మరియు పౌర హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం ఇది తీవ్రమైన శిక్షార్హమైన నేరమని ఫిర్యాదుదారు స్పష్టం చేశారు. ఈ ఘటనపై కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య తీవ్ర స్థాయిలో విమర్శలు, ప్రతివిమర్శలు చోటుచేసుకుంటున్నాయి. సామాజిక సమానత్వంపై దాడికి దిగారంటూ ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా, ఈ వివాదం తీవ్ర రాజకీయ ఉద్రిక్తతకు దారితీసింది.

### నేపాల్కు మరో ముప్పు..చౌలానీ నదిని అడ్డుకున్న భారీ కొండచరియలు

ఖట్మాండూ:నేపాల్లోని దార్చులా జిల్లాలోని అపిహిమాల్ ప్రాంతం భట్టార్ వద్ద భారీ కొండచరియలు విరిగిపడి చౌలానీ నది ప్రవాహం పాక్షికంగా అడ్డంకికి గురైంది. కొండచరియలు ఇంకా విరిగిపడుతున్న నేపథ్యంలో.. నది పూర్తిగా అడ్డుకుపోయి ఒక్కసారిగా భారీగా నీటి ప్రవాహం పెరిగే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. దీంతో నదీ తీర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను అప్రమత్తం చేశారు. పరిస్థితిని అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఇప్పటికే భట్టార్ ప్రాంతంలోని కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఇక ఇప్పటికే నేపాల్ను కుదిపేసిన త్రిశూలి నది విపత్తు విషాదం నుంచి దేశం ఇంకా కోలుకోకముందే.. మరో నదికి కొండచరియల ముప్పు రావడం ఆందోళన కలిగిస్తోంది. త్రిశూలి విపత్తులో 1,300 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా.. 5,600 మందికి పైగా గల్లంతైనట్లు తాజా నివేదికలు చెబుతున్నాయి. ఒకవైపు భారీ ప్రాణనష్టం.. మరోవైపు కొత్తగా నదికి అడ్డంకి..

## కాంగ్రెస్‌ది ప్రజా పాలన కాదు.. మోసపూరిత పాలన



మెదక్ : రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి వెయ్యి రోజుల పాలన పూర్తిగా మోసపూరితంగా సాగుతోందని మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ మాజీ ఎమ్మెల్యే ఎం. పద్మా దేవేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా.. ప్రజా పాలన పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మహిళా సదస్సు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మ దేవేందర్‌రెడ్డి మహిళలతో కలిసి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ, బంజారా మహిళలతో సంప్రదాయ నృత్యాలు చేస్తూ, కోలాటం ఆడుతూ ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడిచినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆరోపించారు. ముఖ్యంగా మహిళలకు ఇచ్చిన తులం బంగారం, ప్రతి నెలా రూ. 2,500 ఆర్థిక సాయం, విద్యార్థినులకు ఉచిత స్కూటీలు వంటి హామీలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ప్రతి నెలా మహిళలకు రూ. 2,500 ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదని అన్నారు. 33 నెలల కాలానికి ఒక్కో మహిళకు సుమారు రూ. 82,500 బకాయి పడినట్లేనని పేర్కొన్నారు. వృద్ధులు, బీడీ కార్మికులకు నెలకు రూ. 4,000, దివ్యాంగులకు రూ. 6,000 పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. 33 నెలల కాలానికి వృద్ధులు, బీడీ కార్మికులకు ఒక్కొక్కరికి సుమారు రూ. 66 వేల చొప్పున, దివ్యాంగులకు కూడా రూ. 66 వేల చొప్పున బకాయి ఉందని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అందించిన రైతుబంధు కంటే ఎక్కువగా రైతులకు ఆర్థిక సాయం చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. ప్రభుత్వ పర్యవేక్షణ లోపంతో పాఠశాలల్లో మౌలిక వసతులు క్షీణించాయని, విద్యార్థుల అడ్మిషన్లు తగ్గిపోయి వేలాది పాఠశాలలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి లు మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1003 రోజులు పూర్తయినా ఇచ్చిన హామీల్లో అనేకం అమలు కాలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో మహిళల కోసం ప్రకటించిన మహిళా డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోయిందని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి ఆ హామీని కూడా విస్మరించారని విమర్శించారు.

## భూములను..బిఆర్ఎస్,కాంగ్రెస్ ఒకే రీతిలో దోచుకుంటున్నాయి

హైదరాబాద్: భూభారతి పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను వేధిస్తోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. బిఆర్ఎస్ హయాంలోనూ ధరణి పేరుతో భూములు దోచుకున్నారని అన్నారు. ఇందిరాపార్క్ ధర్నా చౌక్ మహాధర్నా జరిగింది. రైతుల సమస్యలపై బిజెపి పోరుబాట సాగింది. నిషేధిత భూసమస్యలపై బిజెపి నేతలు గళమెత్తారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. 22ఎ కింద వారి భూములు పెట్టిన విషయం చాలా మంది ప్రజలకు తెలియదని, 22ఎ పేరుతో ప్రజల ఆస్తులను దోచుకుంటున్నారని విమర్శించారు. పట్టాలు అనుమతులు ఉన్న భూములను కూడా 22ఎ కింద పెట్టారని, ప్రజల భూములను దోచుకోవడమే కాదు.. ప్రభుత్వ భూములను అమ్మేస్తున్నారని మండిపడ్డారు. కమ్యూనిటీ హాల్స్, పార్కుల కోసం పెట్టిన భూములను కూడా ప్రభుత్వం అమ్మేస్తోందని, ఈ రాష్ట్రంలో భూములను అమ్మకపోతే పూట గడవని పరిస్థితి ఏర్పడిందని కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వక్ఫ్ తప్ప.. అన్ని రకాల భూములను అమ్మేందుకు సిఎం రేవంత్ రెడ్డి సర్కార్ ప్రయత్నిస్తోందని, తెలంగాణ నుంచి ఢిల్లీకి రూ. వేలాది కోట్లు కప్పం



కడుతున్నారని ధ్వజమెత్తారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒకటే.. ఒకే రీతిలో దోచుకుంటున్నాయని, అధికార పార్టీ నేతలు రాష్ట్రాన్ని రియల్ ఎస్టేట్ కంపెనీగా మార్చేశారని, ఏ రాష్ట్రంలో ఎన్నికలు జరిగినా తెలంగాణ నుంచే డబ్బు వెళ్తోందని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తరగతి గదిలోనే తెలంగాణ భవిత.. 'నేనూ సర్కారు బడి బిడ్డనే'



వికారాబాద్ : "తరగతి గది నాలుగు గోడల మధ్యే దేశ భవిత రూపుదిద్దుకుంటుంది" అన్న నానుడిని నిజం చేస్తూ, తల్లిదండ్రులతో సమానంగా పిల్లల బంగారు భవిష్యత్తుకు బలమైన పునాది వేసేది ఉపాధ్యాయులేనని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వికారాబాద్ జిల్లా కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన గురుపూజోత్సవంలో పాల్గొన్న సీఎం, తాను కూడా సర్కారు బడిలోనే అక్షరం దిద్దుకుని ఈ స్థాయికి ఎదిగానని సగర్వంగా ప్రకటించారు.

'సర్కారు బడి'కి పూర్వవైభవం – ఉపాధ్యాయులపై నమ్మకం :

విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్ల వెల్లువ: రాష్ట్రంలో ప్రభుత్వ బడుల పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగిందని, ఈ విద్యాసంవత్సరం ఏకంగా 88 వేల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో నూతనంగా చేరడమే ఇందుకు నిదర్శనమని సీఎం తెలిపారు. తెలంగాణ విద్యాశాఖ పనితీరు మెరుగుపడి జాతీయ సగటులో 17వ స్థానానికి చేరుకుందని వివరించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని స్పష్టం చేశారు. సంస్కరణల పర్వం: గత ప్రభుత్వ హయాంలో ఉపాధ్యాయులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేసిన సీఎం, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చేపట్టిన చర్యలను ఏకరవు పెట్టారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో పడి నిలిచిపోయిన ఉపాధ్యాయ పదోన్నతులను పారదర్శకంగా పూర్తి చేశామని, జీవో 315 (GO 315) ద్వారా ఉపాధ్యాయుల బదిలీల్లో ఎదురైన చిక్కుముడులను పరిష్కరించినట్లు తెలిపారు. ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామని, పీఆర్సీ సంబంధిత సమస్యల పరిష్కారానికి కూడా కట్టుబడి ఉన్నామని గుర్తుచేశారు. గత పాలకుల విధానాల వల్ల రాష్ట్రంపై రూ. 7.50 లక్షల కోట్ల అప్పుల భారం పడినప్పటికీ, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు కేవలం 90 రోజుల్లోనే రూ. 6,000 కోట్ల రిటైర్మెంట్ బెనిఫిట్స్ విడుదల చేశామని వెల్లడించారు. ఉపాధ్యాయులకు అంతర్జాతీయ ప్రమాణాలపై అవగాహన కల్పించేందుకు విదేశీ అధ్యయన పర్యటనలకు సైతం

## అంతా పథకం ప్రకారమే.. 22ఏపై ఈటల రాజేందర్ ధ్వజం



హైదరాబాద్, తరతరాలుగా సాగుచేసుకుంటున్న భూములు కళ్లముందే చేజారిపోతుంటే ఆ అన్నదాతల గుండెల్లో రేగుతున్న ఆవేదన అంతాఇంతా కాదు. మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో ఏకంగా 55 వేల మంది రైతుల భూములను రిజిస్ట్రేషన్ల చట్టం సెక్షన్ 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం తీవ్ర దుమారం రేపుతోంది. అయితే, వేల ఎకరాల ఆయకట్టును నిశ్శబ్దంగా బంధించిన ఈ నిర్ణయం కేవలం అధికారుల అనాలోచిత తప్పిదమేనా.. లేక అమాయక రైతుల పొట్టకొట్టేందుకు తెరవెనుక సాగిన వ్యూహాత్మక కుట్రనా? ఈ వ్యవహారంపై మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. నర్సాపూర్‌లో రైతుల భూములను నిషేధిత జాబితాలో నెట్టడం క్షేత్రస్థాయి అధికారుల పొరపాటు కాదని, పాలకుల కనుసన్నల్లోనే అంతా పథకం ప్రకారం జరిగిందని ఆరోపించారు. హక్కుల హరణం: రక్తమోడ్చి సేద్యం చేసుకుంటున్న భూములను 22ఏలో చేర్చడంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. బ్యాంకు రుణాలు అందక, అత్యవసరాలకు అమ్ముకోలేక రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. గతంలో ధరణితో రైతులను దగా చేశారని, ఇప్పుడు కొత్తగా తెస్తున్న 'భూభారతి' కాస్తా రైతుల భూములకు 'భూహారతి'గా మారిందని ఈటల ధ్వజమెత్తారు. తప్పును అధికారుల ఖాతాలోకి నెట్టి ప్రభుత్వం చేతులు దులుపుకోలేదని, తక్షణమే 22ఏ జాబితా నుంచి రైతుల భూములను తొలగించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## సంపాదకీయం

ఆదివారం 06-09-2026

# ఏఐ తరం... బోధన మారాల్సిన తరుణం

భారతీయ నాగరికతలో 'ఆచార్య దేవోభవ' అనే మాట వేల సంవత్సరాలుగా ప్రతిధ్వనిస్తూనే ఉంది. గురువు ప్రాధాన్యం నేడు మరింతగా పెరుగుతోంది. ఆధునిక సమాజానికీ, అవసరాలకూ తగ్గట్లు భావితరాన్ని తీర్చిదిద్దడానికి ఇప్పుడు ఉన్న నియామక పద్ధతులు, శిక్షణ సరిపడవు. వీటిలో సంస్కరణలు తీసుకురావడం అత్యవసరం. అప్పుడే 'వేదికపై రుషి'గా భావించే తరగతి గదిలోని ఉపాధ్యాయుణ్ని 'ఆవిష్కరణకు తోడ్పడే మార్గదర్శి'గా చూడగలం. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా...టచ్ స్క్రీన్‌లు, సెర్చ్ ఇంజిన్లు, అల్గారిథమిక్ సిఫారసులు లేని ప్రపంచాన్ని నేటి విద్యార్థులు చూడలేదు. ఈ పరిస్థితి బోధనా విధానంలో నిశ్శబ్దంగా మార్పు తీసుకొస్తోంది. జాతీయ విద్యావిధానం-2020, జాతీయ పాఠ్యప్రణాళిక చట్టం-2023 రెండూ ఈ మార్పును అధికారికంగానే నిర్దేశిస్తున్నాయి. కేవలం పరీక్షల కోసం చదవడం కాదు; సామర్థ్య ఆధారిత అభ్యాసన, ఉన్నతస్థాయి ఆలోచనలు, వైఖరులు వంటివాటి ఆధారంగానే మూల్యాంకనం జరగాలంటున్నాయి. కృత్రిమ మేధ(ఏఐ) ఒక ప్రశ్నను విద్యార్థికి తగ్గట్లు రాసివ్వగలదు, అర్ధరాత్రి పూట అయినా ఏ అంశాన్నయినా బోధించగలదు. కానీ- నిత్యం చురుగ్గా ఉండే ఒక సాధారణ బాలుడు ఎందుకు విచారంగా ఉన్నాడో గ్రహించి, ఆ పిల్లాణ్ని దగ్గరకు తీసుకుని ఆత్మీయంగా, కరుణాభావంతో మాట్లాడలేదు. ఫ్రెంచ్ విప్లవ పాఠాన్ని కాసేపు పక్కనపెట్టి.. చుట్టూ జరుగుతున్న యుద్ధాల గురించీ, శాంతి కోసం ఏం చేయగలమో చర్చించండని ఒక కంప్యూటర్ పిల్లలను అడగలేదు. ఎందుకంటే, దానికి భావోద్వేగాల స్పర్శ తెలియదు, తాత్విక ఆలోచనలను విద్యార్థుల్లో పెంపొందించలేదు. అందుకే, 21వ శతాబ్దపు నైపుణ్యాలతో ఏఐనీ, సాంకేతిక పరిజ్ఞానాన్నీ సమన్వయపరుస్తూ విద్యా వ్యవస్థను ముందుకు నడిపించడంలో ఉపాధ్యాయులు అతి ముఖ్యమైన, అనివార్యమైన చోదకశక్తులుగా నిలుస్తున్నారు.

### సమాచారానికి కొదవ లేదు...

నేడు ఉపాధ్యాయుడి పాత్ర జ్ఞాన ప్రదాత మాత్రమే కాదు; అంతకంటే విలువైన మార్గదర్శి, నైతిక దిక్సూచి కూడా. అందువల్ల డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ అన్నట్లు- ఈ కాలం 'ఉపాధ్యాయులు దేశంలోనే అత్యుత్తమ మేధావులై ఉండాలి'. చిటికెలో సమాధానాలిచ్చే యంత్రాలు ఉన్న డిజిటల్ యుగంలో, తరగతి గదులకు కావాల్సింది ఎన్‌సైక్లోపీడియా లాంటి మెదడు కాదు... సృజనాత్మకంగా, వివేచనతో ఆలోచించే మనసు. అందుకే ఉపాధ్యాయులు విషయ పరిజ్ఞానం, బోధనా నైపుణ్యాలకు తోడు విద్యా సాంకేతికత, పిల్లల మనస్తత్వశాస్త్రం, డేటా ఆధారిత బోధన, నాయకత్వ లక్షణాలను నిరంతరం అలవర్చుకోవాల్సి ఉంది. భారతదేశ విద్యారంగంలో ఇప్పుడు ఒక మంచి మార్పు కనిపిస్తోంది. సాధారణ ఉపాధ్యాయులు పాఠ్య పుస్తకాలు రచిస్తూ, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుకుంటున్నారు. శిక్షణ భాగస్వామ్య కార్యక్రమాల కోసం విదేశీ ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాల ఆహ్వానం అందుకుంటున్నారు. అబ్దుల్ కలామ్ అన్నట్లుగా, 'ఒక వ్యక్తి తత్వాన్నీ సామర్థ్యాన్నీ భవిష్యత్తునూ తీర్చిదిద్దే అత్యంత గొప్ప వృత్తి'గా బోధనను ఎంచుకుంటున్నారు. ప్రస్తుత పరిణామాలను గమనిస్తే, రాబోయే దశాబ్దంలో విద్యారంగం భవిష్యత్తు ఎలా ఉండనుందో అర్థమవుతుంది. ఏఐ తను బాగా చేయగలిగిన పనులను నిశ్శబ్దంగా నిర్వహిస్తుంది, ఉపాధ్యాయుడు మనిషి మాత్రమే చేయగల పనులపై దృష్టి పెట్టడానికి తగినంత సమయం కేటాయిస్తాడు. 2035 నాటి తరగతి గదికి సమాచార బోధకులే కాదు; కొత్త ఆలోచనలకు స్ఫూర్తినిచ్చే, వ్యక్తిత్వ నిర్మాణానికి తర్ఫీదునిస్తూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే నిపుణులూ అవసరమవుతారు. నేడు సమాచారానికి కొదవలేదు కానీ వివేచన, నైతిక స్థైర్యం, ఆత్మశక్తికి తీవ్ర కొరత ఉంది. వాటిని విద్యార్థుల హృదయాల్లో అంకురింపజేయడం ఉపాధ్యాయులతోనే సాధ్యమవుతుంది.

### నియామకాల్లో సంస్కరణలు అవసరం

పాఠ్యప్రణాళిక ఎంత గొప్పగా ఉన్నాసరే, తరగతి గదిలో దానికి జీవం పోసేది మాత్రం ఉపాధ్యాయుడే. 'జెన్ ఆల్ఫా'కు తోడు ఏఐ కూడా తరగతి గదిలోకి వచ్చేసిన తరుణంలో- ఉపాధ్యాయుల ఎంపికకు మునుపటి తరం నియామక పరీక్షలు, బోధనా పద్ధతులు, శిక్షణ సరిపడవు. వీటిలో మార్పు రాకపోతే, ఎంత మంచి పాఠ్యప్రణాళిక అయినా కాగితాలకే పరిమితమవుతుంది. టెట్, సీటెట్ వంటి ఉపాధ్యాయ అర్హత పరీక్షలను మరింత కఠినతరం చేసి, రెండేళ్లకోసారి కాకుండా నిరంతర(రోలింగ్) మదింపు విధానాన్ని ప్రవేశపెట్టాలి. సబ్జెక్టు పరిజ్ఞానంతో పాటు అభ్యర్థుల బోధనా దృక్పథాన్నీ, పిల్లల మనస్తత్వాన్ని అవగాహన చేసుకునే సామర్థ్యాన్నీ, భావోద్వేగ సున్నితత్వాన్నీ పరీక్షించాలి. రాత పరీక్షలో మంచి మార్కులు సాధించినవారు తరగతి గదిలో బాగా రాణించగలరని చెప్పలేం. కాబట్టి, అర్హత పరీక్ష చివరి దశలో ప్రత్యక్ష బోధనా ప్రదర్శనను తప్పనిసరి చేయాలి. జాతీయ ఉపాధ్యాయ రిజిస్ట్రీని బ్లాక్‌చెయిన్ ఆధారిత ధ్రువీకరణ పత్రాలతో ఏర్పాటు చేయడం ద్వారా నకిలీ సర్టిఫికెట్లు, డూప్లికేట్ నియామకాలను నిరోధించవచ్చు. నియామక ఫలితాలు, మెరిట్ జాబితా, కౌన్సెలింగ్ ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్‌లో, రియల్-టైమ్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచాలి. కాంట్రాక్టు, తాత్కాలిక నియామకాలకు బదులు, ప్రొబేషన్ తరవాత పనితీరు ఆధారంగా శాశ్వత నియామకాన్ని ఖరారు చేయాలి. ఏఐ తోడ్పాటుతో ఉపాధ్యాయుడి పనితీరు డేటాను విశ్లేషించి, ఏయే అంశాల్లో మెరుగుదల అవసరమో గుర్తించడంతో పాటు వ్యక్తిగతీకరించిన శిక్షణను అందించాలి. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను 'టీచర్ ఆఫ్ టీచర్స్'గా తీర్చిదిద్ద డం ద్వారా మెంటార్‌షిప్ సర్కిల్స్‌ను అభివృద్ధి చేయాల్సి ఉంది. వార్షిక రహస్య నివేదిక(ఏసీఆర్) స్థానంలో స్వీయ-మూల్యాంకనం, తోటి ఉపాధ్యాయుల అభిప్రా యం, పాఠశాల నాయకత్వ మదింపు, విద్యార్థులూ తల్లిదండ్రుల అభిప్రాయంతో కూడిన నిరంతర, బహుముఖ మూల్యాంకనాన్ని (360-డిగ్రీ ఫీడ్‌బ్యాక్‌ను) ప్రవేశపెట్టాలి. వృత్తి ఎదుగుదలను సర్వీసు ఆధారంగా కాకుండా, పనితీరు ఆధారంగా నిర్ణయించాలి. స్వతంత్ర మూడోపక్షం అకడమిక్ ఆడిట్‌లను సర్కారీ బడులకూ విస్తరించాలి. ఏదిఏమైనా నాణ్యమైన చదువుల కోసం నాణ్యమైన ఉపాధ్యాయులను తయారు చేసుకోవడం కీలకమని ప్రభుత్వాలు గుర్తించాలి!

# టన్నుల కొద్దీ నిల్వ చేసిన బంగారాన్ని.. అమెరికా నుంచి వెనక్కి తీసుకెళ్తున్న యురోపియన్ దేశాలు



లండన్: యురోప్ దేశాలు ఒకప్పుడు అమెరికాలో బంగారాన్నినిల్వ చేసేవి. కానీ ఇప్పుడు ఆ దేశాలు అమెరికా నుంచి తమ బంగారాన్ని వెనక్కి తెప్పించుకుంటున్నాయి. తాజాగా ఆ జాబితాలో నెదర్లాండ్స్ చేరింది. ఇటీవల ఫ్రాన్స్ కూడా తమ బంగారాన్ని అమెరికా నుంచి వెనక్కి తెప్పించుకున్న విషయం తెలిసిందే. బంగారాన్ని నిల్వ చేయడానికి అమెరికా సురక్షితమని భావించిన యురోప్ దేశాలు ఇప్పుడు తమ ప్రణాళికను మార్చడం పట్ల అంతర్జాతీయంగా గందరగోళం ఏర్పడింది. ఇటీవల డచ్ సెంట్రల్ బ్యాంకు డీ నెదర్లాండ్సే బ్యాంక్ సుమారు 86 టన్నుల బంగారాన్ని అమెరిసకా, కెనడా నుంచి లండన్‌కు మార్చేసింది. మార్చి, ఆగస్టు నెలల్లో ఆ ఆపరేషన్ సాగినట్లు తెలిసింది. అయితే రాబోయే రోజుల్లో గడ్డు పరిస్థితులు, సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు తాము ముందుగానే బంగారాన్ని వెనక్కి తెచ్చుకుంటున్నామని యురోపియన్ దేశాలు చెబుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తన వాణిజ్య విధానాలతో ప్రపంచ దేశాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నా.. ఇప్పుడే ఎవరికీ అనుకున్నంత సమస్య రాలేదు. కానీ ఎందుకు యురోపియన్ దేశాలు తమ నిల్వ బంగారాన్ని మరో ప్రదేశానికి మారుస్తున్నాయన్నది మాత్రం ఇంకా అర్థం కావడం లేదు. బహుశా ఈ బంగారాన్ని వాడుతామని అనుకోవడం లేదని, కానీ తమకు తాము బలోపేతం కావడం కోసం ముందస్తుగా వెనక్కి తెచ్చేసుకున్నామని డీఎన్‌బీ ప్రెసిడెంట్ ఓలాఫ్ స్లీజ్‌పెన్ తెలిపారు. సుమారు 83.8 బిలియన్ల డాలర్ల విలువైన 612.4 టన్నుల బంగారం అమెరికా వద్ద ఉన్నట్లు నెదర్లాండ్స్ చెప్పింది. తమ దగ్గర ఉన్న నిల్వల్లో.. అమెరికా వద్ద 31.3 శాతం, ఒట్టావోలో 19.7 శాతం, జీస్ట్‌లో 30.8 శాతం, లండన్‌లో 18.1 శాతం బంగారం ఉన్నట్లు నెదర్లాండ్స్ చెప్పింది. కానీ తాజా చర్యతో లండన్‌లో నెదర్లాండ్స్ బంగారం షేర్ 32.1 శాతానికి పెరిగింది. అమెరికా నుంచి 86 టన్నుల బంగారాన్ని నెదర్లాండ్స్ ఖాళీ చేసింది. కానీ అదేమీ ఫిజికల్‌గా తీసుకెళ్లలేదు. సుమారు 59 టన్నుల బంగారాన్ని అమెరికాలోనే అమ్మేసింది. దానికి రీప్లేస్‌మెంట్‌గా లండన్‌లో ఆ బంగారాన్ని తీసుకున్నది. ఇక 27 టన్నుల బంగారాన్ని మాత్రం అమెరికా, కెనడా నుంచి స్వంత పట్టణం జీస్ట్‌కు తీసుకెళ్లింది. ఇటీవల అమెరికా, యురోపియన దేశాల మధ్య సంబంధాలు బలహీనపడడం వల్లే ఆ దేశాలు తమ బంగారం నిల్వలను వెనక్కి తెచ్చుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ మధ్యే ఫ్రాన్స్‌తో పాటు జర్మనీ కూడా తమ బంగారాన్ని వెనక్కి తెచ్చుకున్నది. జర్మనీకి చెందిన బుందేస్‌బ్యాంక్ సుమారు 216 టన్నుల బంగారాన్ని ట్రాన్స్‌ఫర్ చేసుకున్నది. న్యూయార్క్ నుంచి 111 టన్నులు, పారిస్ నుంచి 105 టన్నుల బంగారాన్ని జర్మనీ వెనక్కి తీసుకువచ్చింది. యుద్ధాలు, వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో కొన్ని దేశాలు ఇలాంటి నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ సీనియర్ మార్కెట్ స్ట్రాటజిస్ట్ జోసెఫ్ కవటోని తెలిపారు. ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు ఎక్కువగా ఉన్న కారణంగా.. ఇలాంటి సందర్భాల్లో బంగారంతో వాణిజ్యం చేయాలన్న యోచనలో పలు దేశాలు ఆ నిల్వలను వెనక్కి తెస్తున్నాయి. బంగారం విక్రయం కోసం లండన్‌ను సురక్షితమైన ప్రాంతంగా భావిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా బంగారం ట్రేడింగ్ లండన్ నుంచి సాగుతున్నది. అయితే ఒకవేళ సంక్షోభం సంభవిస్తే, చాలా వేగంగా ఇక్కడ నుంచి బంగారాన్ని అమ్మేందుకు, కొనేందుకు అవకాశం ఉంటుంది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్.. బంగారం స్టోరేజ్‌కు పాపులర్ పాయింట్‌గా ఉంది. 300 ఏళ్ల క్రితం నాటి ఆ బ్యాంకులో సుమారు 4 లక్షల బంగారం కడ్డీలు ఉన్నట్లు తెలుస్తోంది. వాటి విలువ 200 బిలయన్ల పౌండ్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. వేల సంవత్సరాల నుంచి బంగారాన్ని పెట్టుబడిగా భావించడం వల్ల.. ఆ విలువైన లోహం ఖరీదు కూడా క్రమంగా పెరుగుతోంది. ఇటీవల బంగారం ధర విపరీతంగా పెరిగిన విషయం తెలిసిందే. రికార్డు స్థాయిలో గోల్డ్ రేటు పెరిగింది. ఇక ఇప్పుడు ఉన్న ప్రపంచ సంక్షోభాల నేపథ్యంలో ఆ బంగారాన్ని తమ దగ్గరే దాచుకోవాలన్న తపన కూడా పలు దేశాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. నియంత్రణ లేని రీతిలో బంగారం ధర పెరగడం వల్ల ఆయా దేశాలు తమ బంగారాన్ని తిరిగి తెచ్చేసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. అయితే ఇండియాలో బంగారం ధరం అమాంతం పెరుగుతూనే ఉన్నది. వీలైనంత వరకు బంగారం కొనవద్దు అని ప్రభుత్వం చెబుతోంది. ప్రపంచవ్యాప్తంగా బంగారం ట్రేడింగ్‌లో జరుగుతున్న పరిణామాలు ఎటువంటి దశను క్రియేట్ చేస్తాయో వేచి చూడాల్సిందే.

# స్టీల్ ప్లాంట్ ఆస్తులు వేలం

విశాఖపట్టణం,విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మిగులు భూముల్ని మరోసారి వేలం నిర్వహించబోతున్నారు. విశాఖపట్నంలోని హెచ్‌బీ కాలనీ, గాజువాక ఆటోనగర్ ప్రాంతం ఉన్న 459 ప్లాట్ల విక్రయానికి ఎన్‌ఎల్‌ఎంసీ (నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్) రూ.858.68 కోట్ల రిజర్వ్ ధరతో ఈ?ఆక్షన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. నిధుల సమీకరణ, అసెట్ మానిటైజేషన్‌లో భాగంగా వేలంపాటకు సిద్ధమైనట్లు పేర్కొన్నారు. విశాఖపట్నంలోని సీతమ్మధార పరిధిలో ఉన్న హెచ్‌బీ కాలనీలో 456 ప్లాట్లు 87,949.77 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్నాయి.. వాటిని రూ.838.93 కోట్ల రిజర్వ్ ధరతో వేలానికి సిద్ధమయ్యారు. అలాగే గాజువాక ఆటోనగర్‌లోని బ్లాక్? 2లో 2,728 చదరపు గజాలలో, మూడు బ్లాక్?3లోని 2894.44 చదరపు గజాల్లో ఉన్న రూ.19.75 కోట్లు విలువైన ప్లాట్లను వేలం వేయనున్నారు. ఈ ఏడాది అక్టోబర్ 12వతేదీన ఉదయం 11 గంటల నుంచి 243 ప్లాట్లకు.. 16వతేదీన ఉదయం 11 గంటల నుంచి 216 ప్లాట్లకు వేలం నిర్వహించనున్నారు. అక్టోబర్ 12న 243 ప్లాట్లకు సంబంధించి వేలంలో పాల్గొనేవారు అక్టోబర్ 8 సాయంత్రం 5 గంటలలోపు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు సూచించారు. అక్టోబర్ 16న 216 ప్లాట్లకు సంబంధించి వేలంలో పాల్గొనేవారు అక్టోబర్ 14 సాయంత్రం 5 గంటలలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఒకవేళ ఎవరైనా ఈ ప్లాట్లను చూడాలనుకుంటే కేవీ సుబ్బరాజు, 9849091798.. ఎం ఆంజనేయులు, 9989898999 నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచిస్తున్నారు. 35 ఏళ్ల క్రితం విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు ఉద్యోగుల కోసం సీతమ్మధార ప్రాంతంలోని హెచ్‌బీ కాలనీలో 22.19 ఎకరాల విస్తీర్ణంలో 830 క్వార్టర్లు నిర్మించారు. కానీ స్టీల్‌ప్లాంట్‌కు 15 కిలోమీటర్ల దూరంలో ఈ ప్లాట్లు ఉండటంతో ఉద్యోగులు అక్కడ ఉండటానికి ఆసక్తి చూపించలేదు. ఈ క్వార్టర్లకు సరైన నిర్వహణ లేకపోవడంతో శిథిలమైపోయాయి. ప్రస్తుతం ఈ ప్లాట్లు ఉన్న ప్రాంతంలో భూముల ధరలు పెరిగాయి. అక్కడ గజం రూ.లక్షన్నర నుంచి రూ.2 లక్షలు పలుకుతోందని చెబుతున్నారు. గతంలో ఈ-వేలం ద్వారానే హెచ్‌బీ కాలనీలో కొన్ని ప్లాట్లు విక్రయించగా.. రూ.150 కోట్ల వరకు ఆదాయం వచ్చింది. ఇప్పుడు మరోసారి వేలానికి సిద్ధమవుతున్నారు. స్టీల్ ప్లాంట్ యాజమాన్యం విశాఖపట్నంలోని హెచ్‌బీ కాలనీ, ఆటోనగర్‌లో ఉన్న భూములు.. హైదరాబాద్, చెన్నై వంటి ప్రాంతాల్లో ఉన్న భూముల్ని విక్రయించేందుకు సిద్ధమైంది. కానీ ఈ భూముల విక్రయించొద్దంటూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ కోర్టులో పిల్ దాఖలు చేయడంతో స్టే విధించారు.. దీంతో కొన్నాళ్లు ఈ భూముల వేలం ప్రక్రియ ఆగిపోయింది.. మళ్లీ ఇప్పుడు మరోసారి భూముల వేలానికి సిద్ధమయ్యారు.

# ప్రజాస్వామ్యంతో మోడీ ఘర్షణ



న్యూఢిల్లీ,ప్రధాన మంత్రి మోడీ తన అధికారం కోసం కేవలం ప్రతిపక్షాలతో కాక ప్రజాస్వామ్యంతోనే ఘర్షిస్తున్నారు. బిజెపి ఆ పార్టీ మాతృసంస్థ అయిన ఆర్ఎస్ఎస్, దాని నాయకత్వాన గల సంఘ్ పరివార్‌లు కూడా భారతదేశ ప్రజాస్వామ్యంతో ఘర్షణ పడుతున్నాయి. దానిని అంతం చేసి తమ సైద్ధాంతికతలకు అనుగుణంగా దేశాన్ని తీర్చిదిద్దాలని ప్రయత్నిస్తున్నాయి. అది సాధ్యమయే దేనా? విషయాలను సాకల్యంగా, సావధానంగా పరిశీలించినపుడు అట్లాతోచదు. ఈ మాట అనటం ఎందుకో చెప్పాలంటే కొన్ని విషయాలు మాట్లాడుకోవాలి. అవి ఈ దేశ సమాజ నిర్మాణం తీరుతెన్నులు, వైవిధ్యతలు, చరిత్ర నుంచి మొదలుకొని, వర్తమానంలో బిజెపి కి ఎదురవుతున్న సవాళ్ల వరకు అనేకం ఉన్నాయి. ఆ సవాళ్లలో కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) ఆకస్మికంగా ఒక తోక చుక్కవలే ఈ సమాజం నుంచి ఆవిర్భవించటమన్నది సంకేతప్రాయం మాత్రమే. ముందుగా ఒక మాట అనుకోవాలంటే, భారతదేశ సమాజ నిర్మాణం, వైవిధ్యతలు, చరిత్రతో సంఘ్ పరివార్‌కు, బిజెపి మౌలికంగానే తీవ్రమైన వైరుధ్యాలున్నాయి. అవేమిటో ఒక్కటొక్కటిగా చూద్దాము. భారతదేశమన్నది సాధారణ అర్థంలో ఒక ఏకీకృత దేశం కావటం గాని, స్థిరరూపంలో నిలవటంగాని 1947 వరకు జరగలేదని తెలిసిందే. చారిత్రక కాలంలో కొని మహా సామ్రాజ్యాలు ఏర్పడి సువిశాలమైన భూభాగాలను తమ ఏలుబడిలోకి తెచ్చినా, ఆ ఐక్యతలు యుద్ధాలు, వాటిలో జయాపజయాలుపై ఆధారపడి మాత్రమే నిలిచాయని కూడా తెలిసిందే. ప్రపంచం ఆధునిక దశలలోకి ప్రవేశించి వలస పాలనల కాలంలో నిర్దిష్టమైన సరిహద్దులు, వేర్వేరు భూభాగాల ఐక్యతలు ఆధునిక రాజ్యాంగాలు అమలుకు వచ్చిన మీదట గాని మనం ఇపుడు చూసే భారతదేశమన్నది రూపు తీసుకోదన్నది సైతం తెలిసిందే. అట్లాగని హిమాలయాలు నుంచి హిందూ మహాసముద్రం వరకు భారత జాతి అనదగ్గది లేదా? ఎంతమాత్రం కాదు. యూరప్‌లో రూపుదిద్దుకున్న తరహాలో ఈ మొత్తం భూఖండానికి వర్తించే విధంగా ఆధునికి మైన అర్థంలో చారిత్రక కాలం నుంచి లేని మాట నిజమే. కాని, ప్రాంతాలూ భాషలవారీగా వేర్వేరు జాతులు, స్థానిక సంస్కృతులు ఉండినా, అత్యధిక భూఖండానికి సంబంధించి స్థూలంగా ఒక సంస్కృతి కూడా అందుకు సమాంతరంగా ఉండేది. ఒక పరిభాషలో ఆ స్థితిని జాతి, ఉపజాతులు అన్నారు. కొందరు అసలు భారత జాతి అన్నది లేదని, అటువంటి నిర్మాణం జరగలేదని, లేదా ఇంకా జరిగే క్రమంలో ఉన్నదని, ప్రస్తుతం ఉన్నవన్నీ వేర్వేరు జాతులు మాత్రమేనని అన్నారు. ఈ చర్చోపచర్చలు ఎట్లున్నా ఒక తిరుగులేని వాస్తవాన్ని మాత్రం గుర్తించాలి. అదేమంటే, ఈ సువిశాల దేశంలో అనేకానేక వైవిధ్యతలు చరిత్ర పూర్వయుగంలో ఉన్నాయి, చారిత్రక కాలంలో ఉన్నాయి. ఈ ఆధునిక కాలంలోనూ ఉన్నాయి. వేల ఏళ్లుగా స్థిరపడి కొనసాగుతున్న ఈ వైవిధ్యతలు ఎవరుగాని, ఎంత ప్రయత్నించినా గాని, చెరపజాలరు. ప్రజాస్వామ్యం అనే దానికి మూలాలు, లేదా పునాదులు ఈ స్థితిలో ఉన్నాయి. గుర్తించదగినది ఏమంటే ఈ మౌలిక వాస్తవాన్ని రాజ్యాలనేలిన రాజులు క్రీస్తు పూర్వం ఆ తర్వాత కాలంలోనూ గౌరవించి అనుసరించారు. ఆయా రాజులు స్థానికలు అయినా, బయటి నుంచి వచ్చినవారైనా, యూరోపియన్ వలస పాలకులు అయినా సరే. ఈ మాటను చరిత్రలను చదివిన వారెవరైనా చెప్పగలరు. గతంలోకి వెళితే ఇందుకు తార్కాణాలు మహాభారతం వంటి కావ్యాలలోనూ కనిపిస్తాయి. మన సుదీర్ఘ చరిత్రల పొడవునా రాజులు, మహారాజుల నుంచి బ్రిటిష్ వలస పాలకుల వరకు స్థానిక పాలకులతో, తెగలతో వారి స్వయం ప్రతిపత్తిని స్థానిక సంస్కృతలను, భాషలను మన్నించి, సామరస్యతను చూపినవారే. అందుకు భిన్నంగా వాటిని నిర్లక్షం చేసిన, లేదా అణచివేయ ప్రయత్నించిన కేంద్ర పాలకులు తామే బలహీనపడ్డారు, పతనమయారు. ప్రజాస్వామికత అనే దాని సూత్రాలు ఇందులోనే ఇమిడి ఉన్నాయి. భారత దేశ సుదీర్ఘ చరిత్రను, పలు విధాలైన వైవిధ్యతలను కూలంకషంగా అధ్యయనం చేసిన వారు గనుకనే భారత స్వాతంత్ర్యోద్యమ నాయకులు అందరూ అసలు మొదట ఆ ఉద్యమాన్నే సమ్మిళితమైన ప్రజాస్వామిక మార్గంలో నడిపారు. వలస పాలన వ్యతిరేకోద్యమం ఏ విధంగా మొదలైంది, మొదలుపెట్టిన వారెవరు, ఈ సువిశాల వైవిధ్య దేశంలో ఎవరెపుడు, ఏ విధంగా పాల్గొంటూ వచ్చారు. అది ఏ విధంగా విస్తరించింది, ఉద్యమ నాయకులు ఎవరిని ఏ విధంగా ఉద్యమంలోకి సమ్మిళితం చేస్తూపోయారు, అట్లా చేయవలసిన అవసరం ఏమి వచ్చింది, అందువల్ల కలిగిన సానుకూల ఫలితాలు ఏమిటి, ఈ విధమైన దార్శనికతతో కూడిన కృషివల్లనే చివరకు దేశ స్వాతంత్ర్య సాధ్యమైంది అనేవన్నీ జాగ్రత్తగా అర్థం చేసుకోవలసిన విషయాలు. విషయమేమంటే ఇదంతా చెప్తున్నది సమ్మిళిత ప్రజాస్వామ్యం ఆవశ్యకతను. సరిగా ఇదే అంతిమంగా భారత రాజ్యాంగ రచనలో ప్రతిఫలించింది. దేశ సుదీర్ఘ చరిత్రలు, మొత్తం ప్రపంచంలోనే మరెక్కడా కనిపించని వైవిధ్యతల నేపథ్యంలో, అటువంటి సమ్మిళిత ప్రజాస్వామిక రాజ్యాంగ రచనలో, ఆమోదంలో పలు భిన్నమైన ఆలోచనా ధోరణులు గల రాజ్యాంగ సభ సభ్యులు పాల్గొనటం గమనించదగ్గది. ఆ సభ్యులలో మితవాదులు, మధ్యేమార్గవాదులు, అతివాదులు అందరూ ఉన్నారు. వారు చర్చలను హోరాహోరీగా సాగించినా, అంతిమంగా సమ్మిళిత ప్రజాస్వామ్యానికి ఓటు చేసారు. రాజ్యాంగానికి ఫెడరలిస్టు లక్షణాలు, అన్ని భాషా సంస్కృతులకు జాతులకు, ప్రాంతాలకు, మతాలకు సమాన గుర్తింపులు, అభివృద్ధి అవకాశాల వంటివి అందులో భాగమయాయి. స్వాతంత్ర్యానంతరం విధానాలు, చట్టాలు, వాటి అమలు ఇందుకు అనుగుణంగా సాగినపుడు ప్రజల నుంచి, వివిధ వైవిధ్య వర్గాల నుంచి అంత సజావుగా ఉండి, కానపుడు ఘర్షణ స్థితులు తలెత్తుతూ వస్తున్నాయి. ఈ మొత్తం కథాక్రమంలో ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్, బిజెపిల దృష్టి, పాత్ర ఏమిటన్నది అంతిమంగా వేసుకోవలసిన ప్రశ్న. ఈ దేశంలోగల పలు విధాలైన వైవిధ్యతలతో, ముఖ్యంగా స్వాతంత్ర్యోద్యమ కాలంతోపాటు తదనంతర రాజ్యాంగ దశలో గల సమ్మిళితత్వంతో, ప్రజాస్వామికతతో వారికి గలది ఏకీభావమా లేక సంఘర్షణా? 1925 లో ఆర్ఎస్ఎస్ స్థాపన జరిగినప్పటి నుంచి మొదలుకొని, ఈ 2026 వ సంవత్సరంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పరిపాలన సాగుతున్న తీరువరకు పరిశీలించినపుడు కలిగే అభిప్రాయం ఏమిటి? వారికి మొదటినుంచి కొన్ని ఆలోచనలు, లక్షాలు, వాటి సాధనకు అనుసరించదలచిన మార్గాలు ఉన్నాయి. అందులో ఏకశిలా సదృశమైన ఒక వ్యవస్థకు తప్ప వైవిధ్యతకు తావులేదు. ఏ విధమైన వైవిధ్యతలకు కూడా. ప్రాంతపరమైన, భాషపరమైన, మతపరమైన వైవిధ్యతలు అన్నింటిని తిరస్కరిస్తున్నట్లు వారు మొదటనే స్పష్టంగా, బాహాటంగా ప్రకటించారు. భారతదేశ చరిత్రలోని స్వభావంతో, సమాజపు వైవిధ్యతలతో, వాటిలోని అంతర్నిహితమైన సమ్మిళతత్వంతో, ప్రజాస్వామికతతో వారికి ఆ విధంగా మొదటినుంచే ఘర్షణ ఏర్పడింది. తమవైన స్వంత లక్షాలను సాధించుకోవాలంటే వారికి తప్పని ఘర్షణ అది. ఉద్దేశపూర్వకంగా సృష్టించుకున్న ఘర్షణ. అది ఆరంభం నుంచే వారి భావజాలంలో ఉన్నటువంటిది గనుకనే, సమ్మిళిత ప్రజాస్వామ్యమార్గంలో సాగుతుండిన స్వాతంత్ర్యోద్యమం వారికి సరిపడనిది అయింది. కనుకనే వారు ఆ ఉద్యమానికి దూరంగా ఉండిపోయారు. స్వాతంత్ర్యానంతరం జాతీయ పతాకను దశాబ్దాలపాటు ఎగరవేయలేదు. స్వాతంత్ర్య దినాన్ని జరుపుకోలేదు. సమ్మిళిత ప్రజాస్వామిక రాజ్యాంగం నచ్చలేదు గనుక, అందుకు విరుద్ధమైన తమ ఆలోచనలతో ప్రత్యామ్నాయ రాజ్యాంగాన్ని రచించారు. ప్రస్తుత రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. ఈ విధమైన గతంనుంచి వర్తమానాకి వస్తే, భారత ప్రజాస్వామ్యంతో, సమ్మిళితత్వంతో, వైవిధ్యతతో ప్రధాని మోడీ ఘర్షణ కొత్త పుంతలు తొక్కుతున్నది. ఈ ఘర్షణలో గమనించదగిన కొత్తదనం ఒకటున్నది. మొదటి దశలో ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్‌ల ఈ ఘర్షణ వారి ఆలోచనలు, లక్షాలు, సైద్ధాంతికతల పరిధిలో సాగింది. తర్వాత వాజపేయి, అద్వానీలు పాలించినపుడు సైద్ధాంతికతలు, లక్షాలు మౌలికంగా మారలేదుగాని, సమ్మిళిత ప్రజాస్వామికత విషయంలో కొన్ని సడలింపులు కనిపించాయి. అది వారికి పరిపాలన కోసం అవసరమైంది తప్ప వ్యక్తిగత అధికారం కోసం కాదు. వారిద్దరి వ్యక్తితాలు అటువంటివి. అధికారాన్ని అనువుగా చేసుకుంటూ పరివార్ లక్షాలను ముందుకు తీసుకుపోయే ప్రయత్నమైతే చేసారు గాని, అందుకోసం సమ్మిళిత ప్రజాస్వామ్యపు హద్దులను ఉల్లంఘించలేదు.

## ఆరణికి రాజకీయ ఇబ్బందులు

తిరుపతి,కొందరు పార్టీలు మారి ఎమ్మెల్యేలు కావచ్చు. అంత మాత్రాన పట్టున్న నియోజకవర్గంలో కాలరెగరేస్తే రాజకీయ భవిష్యత్ ఇబ్బందుల్లో పడే అవకాశముంది. ప్రస్తుతం జనసేన తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పరిస్థితి కూడా అలాగే ఉంది. తిరుపతి నియోజకవర్గంలోని జనసేన నేతలు, కార్యకర్తల నుంచి ఆయన వ్యతిరేకత ఎదుర్కొంటున్నారు. ఇక కూటమిలోని మిత్ర పక్షాలు కూడా ఆయనకు మద్దతుగా నిలిచే అవకాశం కనిపించడం లేదు. ఆయన తిరుపతి ఎమ్మెల్యే అయిన తర్వాత నియోజకవర్గాన్ని పట్టించుకోకపోవడంతో పాటు, తమను కూడా దూరం పెట్టడంతో కూటమిలోని మిత్ర పక్షాల నుంచి ఆరణికి రాజకీయ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆయనపై ఉన్న అసంతృప్తి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలపై పడే అవకాశముందన్న ఆందోళన జనసేన నేతల్లో ఉంది. స్థానిక క్యాడర్ నుంచి... తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై పార్టీ క్యాడర్, స్థానిక నాయకుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జనసేన క్యాడర్‌ను పట్టించుకోకపోవడంతో పాటు అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ కార్యకర్తలను, సీనియర్లను ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. వైసీపీ నేతలతో సంబంధాలు కూడా ఆరణి శ్రీనివాసులుకు ఇబ్బందిగా మారాయంటున్నారు. కూటమి కార్యకర్తలను పక్కన పెట్టి, కొందరు వైసీపీ నేతలతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇక మున్సిపల్ కార్పొరేషన్ వ్యవహారాలలో ఆరణి శ్రీనివాసులు ఎమ్మెల్యే బంధువులు, కుటుంబ సభ్యులు జోక్యం చేసుకోవడం వివాదాస్పదమైంది. ఇప్పటికే ఆరణి శ్రీనివాసులుపై సొంత పార్టీ నేతలే ఫిర్యాదు చేయడంతో సమన్వయంతో పనిచేయాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్వయంగా ఆయనకు సీరియస్ వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. ఆరణి శ్రీనివాసులు వైసీపీ నుంచి జనసేనలోకి వచ్చారు. 2019 లో చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ తరుపున పోటీ చేసి విజయం సాధించారు. నాడు తిరుపతి ప్రాంతంలోని అనేక మంది వైసీపీ నేతలతో సంబంధాలున్నాయి. ప్రధానంగా భూమన కరుణాకర్ రెడ్డితో ఆయనకు సన్నిహిత్వం ఉందంటారు. అలాగే మరి కొందరు వైసీపీ నేతలను కూడా ఆయన దగ్గర తీస్తున్నారన్న ఆరోపణలున్నాయి. విపక్ష వైసీపీ చేసే విమర్శలకు కూడా ఆరణి శ్రీనివాసులు కౌంటర్ ఇవ్వకపోవడం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పై విమర్శలు చేసినా చూసీచూడనట్లు వ్యవహరించడంతో పార్టీ నాయకత్వం కూడా ఆయన వ్యవహార శైలి పట్ల ఆగ్రహంగా ఉందని తెలుస్తోంది. వివాదాలు లేకపోయినా.. అనేక ఆరోపణలు ఆరణి శ్రీనివాసులును చుట్టుముడుతుండటంతో ఆయన రాజకీయంగా ఇబ్బందులలో పడినట్లేనని సొంత పార్టీ నేతలే చెబుతుండటం విశేషం.

## అధికారులు నిర్లక్ష్యం వాహనదారులకు శాపం

దేవీపట్నం,పోలవరం జిల్లాలోని రంపచోడవరం మండలం,తామరపల్లి పంచాయతీ ప్రజలు రోడ్డు సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తామరపల్లి నుంచి ఈతలపాడు వరకు ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతినింది. పెద్ద పెద్ద గుంతలు, రాళ్లు తేలిన ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారింది. ప్రమాదాలు కూడా తరచుగా జరుగుతున్నాయి.?ఈ రోడ్డు పంచాయతీ కేంద్రానికి ప్రధాన రహదారి. ప్రజలే కాకుండా సచివాలయం సిబ్బంది కూడా ఈ రోడ్డు ద్వారానే ప్రయాణించాలి. పనుల నిమిత్తం సచివాలయానికి వెళ్లే ప్రజలు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.?తామరపల్లి పరిసర ప్రాంతాల్లో సుమారు 200 ఎకరాలలో వ్యవసాయం సాగు చేస్తున్నారు. ఎరువులు సరఫరా చేయడానికి, అలాగే పండించిన పంటను ఆర్బికే (ఖీఃఐ) ద్వారా తరలించడానికి ఈ రోడ్డు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ రోడ్డుపై ప్రయాణం అసాధ్యంగా మారుతుంది. దీనివల్ల రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లుతుంది.?గ్రామస్తులు గతంలో ఎన్నోసార్లు గ్రీవెన్స్ డే లో దరఖాస్తు చేసుకున్నారు, కానీ ఫలితం లేదు. స్థానిక ఎమ్మెల్యే కి కూడా ఈ సమస్య గురించి విన్నవించినప్పటికీ, కేవలం హామీలు మాత్రమే లభిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.?కొన్ని నెలల క్రితం జిల్లా కలెక్టర్ శ్రీ దినేష్ కుమార్ మా తామరపల్లి పంచాయతీకి వచ్చినప్పుడు ప్రజల కష్టాలు విన్నారు. ఆయన కూడా రోడ్డు సమస్య పరిష్కారం కోసం తన వాగ్దానాన్ని ఇచ్చారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.?కాబట్టి, మేము గౌరవనీయులైన జిల్లా కలెక్టర్ గారికి విన్నవించుకుంటున్నాము. మా తామరపల్లి ప్రజల కష్టాలను, ఇబ్బందులను అర్థం చేసుకుని, మాకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుకుంటున్నాము. మా వ్యవసాయ రంగం అభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి ఈ రోడ్డు ఎంతో అవసరం. కలెక్టర్ మా విన్నపాన్ని పరిశీలించి, వెంటనే చర్యలు తీసుకోవాలని ఆశిస్తున్నాము.

## క్రెడిట్ కోసం తంటాలు

విజయవాడ,వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం కొత్తగా పనులేమీ చేపట్టకుండా, కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమవుతోందని విమర్శించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు.పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తూ, వాటిని పోలవరం ప్రాజెక్టు జలాలుగా చూపిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రచారం చేసుకుంటున్నారని జగన్ విమర్శించారు. పురుషోత్తపట్నం పంపులు కానీ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ కానీ ప్రస్తుత ప్రభుత్వం నిర్మించినవి కావని ఆయన స్పష్టం చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే పోలవరం ఎడమ కాలువకు సంబంధించి 79 శాతం పనులు పూర్తయ్యాయని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.క్షేత్రస్థాయిలో కొత్తగా ఎటువంటి పనులు చేపట్టకుండా, గతంలో పూర్తయిన ప్రాజెక్టుల ద్వారా లబ్ధి పొందాలని ప్రభుత్వం ఆరాటపడుతోందని జగన్ ఆక్షేపించారు. ప్రజాధనంతో ప్రాజెక్టుల వద్ద ప్రచార కార్యక్రమాలు, పబ్లిసిటీ స్టంట్లు నిర్వహించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు.

## ఐపీఎస్‌లు కాంతి రాణా, విశాల్ గున్నీలకు రిలీఫ్

విజయవాడ, ఆంధ్రప్రదేశ్ సీనియర్ ఐపీఎస్ అధికారుల సస్పెన్షన్ వ్యవహారంలో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఐపీఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల్ గున్నీలపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ రాష్ట్ర సాధారణ పరిపాలనా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అఖిల భారత సర్వీసుల నిబంధనల ప్రకారం గతంలో విధించిన సస్పెన్షన్ గడువు సెప్టెంబర్ 4తో ముగియనున్న తరుణంలో, డీజీపీ అందించిన సమగ్ర నివేదికలు , ఐపీఎస్ అధికారి కాంతి రాణా టాటా సమర్పించిన వినతిపత్రాన్ని పరిశీలించిన అనంతరం ప్రభుత్వం ఈ ఆదేశాలు ఇచ్చింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ పేరుతో విడుదలైన ఈ ఉత్తర్వులతో వీరిద్దరూ తిరిగి సర్వీసులోకి తీసుకున్నారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముంబైకి చెందిన నటి కాదంబరి జత్వానీ వ్యవహారంలో అక్రమ అరెస్టులు, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే బలమైన ఆరోపణలతో ఈ ఇద్దరితో పాటు ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులుపై కూడా ప్రభుత్వం గతంలో సస్పెన్షన్ వేటు వేసింది. కేసు నమోదు కాకముందే ముంబైకి వెళ్లి నటితో పాటు ఆమె తల్లిదండ్రులను అరెస్ట్ చేయడం, తగిన విచారణ లేకుండానే రాత్రికి రాత్రే ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలోకి తీసుకురావడం వంటి వాటిలో వీరి ప్రమేయం ఉందని విజయవాడ మాజీ సీపీ కాంతి రాణా టాటా, నాటి డీసీపీ విశాల్ గున్నీపై కేసు నమోదైంది. గత ప్రభుత్వ పెద్దల అభీష్టానికి అనుగుణంగా చట్టాన్ని ఉల్లంఘించి వీరు వ్యవహరించారనే నివేదికల ఆధారంగానే నాడు ప్రభుత్వం వీరిపై కఠిన చర్యలు తీసుకుంది.అయితే, తాజాగా వీరిద్దరిపై సస్పెన్షన్ ఎత్తివేసినప్పటికీ శాఖాపరంగా జరుగుతున్న అంతర్గత విచారణలు, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులపై ఈ నిర్ణయం ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపబోదని ప్రభుత్వం స్పష్టం చేసింది. కేసు దర్యాప్తు దాని దారిన అది కొనసాగుతుందని, కేవలం సర్వీస్ రూల్స్ ప్రాతిపదికన మాత్రమే వీరిద్దరినీ మళ్లీ సర్వీసులోకి తీసుకున్నట్లు స్పష్టత ఇచ్చింది. డీజీపీ ద్వారా సస్పెన్షన్ ఉపసంహరణ ప్రతులను అధికారులకు అందజేసి, వారి నుంచి రసీదులు సేకరించాలని సూచించింది.రాష్ట్ర పోలీస్ శాఖలో అత్యంత ఉన్నత పదవుల్లో పనిచేసిన వీరు, గత ప్రభుత్వ హయాంలో వివాదాస్పద రీతిలో వ్యవహరించడం వల్ల చాన్నాళ్ల పాటు పోస్టింగ్‌లు లేకుండా పక్కన పెట్టబడ్డారు. ఇప్పుడు సస్పెన్షన్ ఎత్తివేత తర్వాత వీరికి ఏ శాఖలో పోస్టింగ్ ఇస్తారనేది పోలీస్ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. లూప్‌లైన్ పోస్టింగ్‌లకు లేదా నాన్-ఫోకల్ పోస్టులకే వీరిని పరిమితం చేసే అవకాశం ఉందని సీనియర్ అధికారులు భావిస్తున్నారు.సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఈ ఐపీఎస్ అధికారుల సస్పెన్షన్ ఎపిసోడ్ తాజా ఉత్తర్వులతో ఒక ముగింపునకు వచ్చినట్లు కనిపించినా, వారిపై ఉన్న క్రిమినల్ విచారణలు ముగిసే వరకు చట్టపరమైన చిక్కులు తొలగిపోయినట్లు కాదని స్పష్టం చేస్తున్నారు. విధుల్లోకి చేరిన అనంతరం ప్రభుత్వం నుంచి వచ్చే తదుపరి పోస్టింగ్ ఉత్తర్వుల కోసం ఈ అధికారులు వేచి చూడాల్సి ఉంది.

## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలన..

మంచిర్యాల,కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల వైఫల్యాలను నిరసిస్తూ మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వంటావార్పు నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంటావార్పు కార్యక్రమంలో పాల్గొన్న హరీశ్ రావు.. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, మోసపూరిత విధానాలపై తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. పేదల సంక్షేమాన్ని గాలికొదిలేసి, కమిషన్ల కోసమే కాంగ్రెస్ పాలన సాగిస్తోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల పాలనలో ఏం జరిగిందని చూస్తే.. అంతా కబ్జాలు, కుంభకోణాలు, లూటీలు, సెటిల్మెంట్లే తప్ప పాలన ఎక్కడా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. వెయ్యి రోజుల రేవంత్ పాలనలో అభివృద్ధి మటుమాయమైపోయింది. వెయ్యి పడగలతో అవినీతి రాజ్యమేలుతోంది.ఈ రాష్ట్రంలో పేదల సంక్షేమం పూర్తిగా బందైపోయింది. కేసీఆర్ గారు ప్రవేశపెట్టిన పథకాల వల్ల కమిషన్లు రావన్న ఒకే ఒక్క కారణంతో వాటన్నింటినీ రేవంత్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా ఎత్తేసిందని అన్నారు.రైతుబంధు నిర్వీర్యమైంది, రైతుబీమా ఎగ్గొట్టారు, కేసీఆర్ కిట్ బంద్ చేశారు, గొర్రెల పంపిణీ పథకం ఆపేశారు, చేప పిల్లల పథకాన్ని గాలికొదిలేశారు, బీసీ బంధు జాడ లేదు, దళితబంధు పత్తా లేకుండా పోయింది. రేవంత్ పాలన అంతా కేవలం కమిషన్ల చుట్టూనే తిరుగుతోంది. ఎన్నికల ముందు వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని, అవ్వాతాతలకు నాలుగు వేల పెన్షన్ ఇస్తామని ఊదరగొట్టారు. కేసీఆర్ గారు అధికారంలో ఉన్నప్పుడు మాట తప్పకుండా రూ.200 ఉన్న పెన్షన్ను మొదటి నెలలోనే రూ.2,000 చేసిన గొప్ప నాయకుడు. కానీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చి 33 నెలలు పూర్తయినా.. ఒక్క వికలాంగుడికి, ఒక్క వితంతువుకి, ఒక్క వృద్ధుడికి కూడా కొత్త పెన్షన్ ఇవ్వలేదని అన్నారు.కేసీఆర్ ఏకంగా 42 లక్షల మంది పేదలకు నెలనెలా రూ.2,000 గౌరవప్రదంగా పెన్షన్ అందిస్తే.. రేవంత్ రెడ్డి కొత్త పెన్షన్లు ఇవ్వకపోగా, ఉన్నవాటిలో ఏకంగా మూడున్నర లక్షల పెన్షన్లను నిర్దాక్షిణ్యంగా రద్దు చేసి పేదల కడుపు కొట్టాడు. రేవంత్ రెడ్డి నిత్యం ఆంధ్రప్రదేశ్ ఆదర్శం అంటాడు, ఆయన గురువు గారిని ఆదర్శంగా తీసుకుంటానని చెబుతాడు. మరి నీ గురువు గారు ఆంధ్రప్రదేశ్లో గెలిచిన మొదటి నెలలోనే 4,000 పెన్షన్ ఇస్తున్నప్పుడు.. 33 నెలలైనా నువ్వు తెలంగాణలో ఎందుకు ఇవ్వడం లేదు? వృద్ధుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ రేవంత్ సర్కార్ను నిలదీస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చూస్తే.. గత 33 నెలలుగా నెలకు రూ.2,000 చొప్పున ఇప్పటివరకు ప్రతి అవ్వకు, తాతకు

# 'జలసంధి' ఎవరి బందీ కారాదు



న్యూఢిల్లీ,అమెరికా ఇరాన్ మధ్య ఘర్షణలు మళ్లీ పెరుగుతున్నాయి. హర్మూజ్ జలసంధి ద్వారా నౌకా రవాణాకు భద్రత లభించడం లేదు. ఎప్పుడు ఏ నౌకపై దాడులు జరుగుతాయో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో హర్మూజ్ జలసంధిని పూర్తిగా తమ అధీనంలోకి తీసుకురావడానికి ట్రంప్ ప్రభుత్వం విశ్వప్రయత్నం చేస్తోంది. హర్మూజ్ జలసంధిలోని మందుపాతరలను పూర్తిగా తొలగించామని ప్రకటించింది. మంగళవారం దక్షిణ ఇరాన్‌లోని తీర ప్రాంతాలతోపాటు హర్మూజ్ వెంబడి లక్షాలపై అమెరికా దాడులు చేసింది. హర్మూజ్ జలసంధి దాదాపుగా తమ నియంత్రణ లోకి వచ్చిందని, దాని పేరును ట్రంప్ జలసంధిగా మారుస్తున్నామని ట్రంప్ ప్రకటించడం విశేషం. ఇంతవరకు ఇరాన్ సైనిక స్థావరాలపైనే భారీగా దాడులు చేసే ట్రంప్ ప్రభుత్వం ఇప్పుడు హర్మూజ్ జలసంధినే ప్రధాన టార్గెట్‌గా చేసుకుని దాడులు చేయడం ప్రారంభించింది. వాణిజ్య నౌకలకు ఎలాంటి ముప్పు రాకుండా రక్షణ కల్పించడానికి ముందుకు వస్తోంది. ఒకే రోజులో సుమారు 18మిలియన్ బ్యారెళ్ల చమురును తరలిస్తున్న 40 వాణిజ్య నౌకలకు అమెరికా సైన్యం రక్షణ కల్పించి హర్మూజ్ జలసంధినుంచి సురక్షితంగా తరలించడం ప్రత్యేకించి చెప్పుకోతగ్గది. ఇలాంటి అవాంతరాలు లేకుండా తమ ఇంధన నిల్వలను, ఇతర ముఖ్యమైన అవసరాలను సురక్షితంగా రవాణా చేసుకునేందుకు ప్రపంచ దేశాలు ప్రత్యామ్నాయ ఇంధన రవాణా మార్గాలను అభివృద్ధి చేసుకునే దిశగా ముందుకు సాగుతున్నాయి. భవిష్యత్తులో హర్మూజ్ జలసంధి అవసరం తగ్గి, దానిపై ఇరాన్ నియంత్రణ లేదా ప్రభావం తగ్గే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఇరాన్‌కు హర్మూజ్ జలసంధి అత్యంత శక్తివంతమైన వ్యూహాత్మక ఆయుధంగా కొనసాగుతోంది. అందుకనే భారత్ వంటి తటస్థ దేశాల నౌకలను కూడా ఇరాన్ లక్ష్యంగా చేసుకుంటోంది.అయితే ఏదైనా ఒత్తిడి, లేదా ఆధిపత్యాన్ని పదేపదే ఉపయోగిస్తే , దానికి ప్రత్యామ్నాయ మార్గాలను ప్రజలు లేదా దేశాలు వెతకడం ప్రారంభిస్తారు. అందువల్ల హర్మూజ్ జలసంధిపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడానికి దేశాలు ఇప్పటికే ప్రత్యామ్నాయ మార్గాలను రూపొందిస్తున్నా యంటే ఆశ్చర్యపడవలసిందేమీ లేదు. ఇంకో రెండు సంవత్సరాల్లో హర్మూజ్ జలసంధి ఒక 'పనికి రాని జలమార్గం'గా మారవచ్చని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ టెసెంట్ వ్యాఖ్యానించడం పూర్తిగా తప్పు కాకపోవచ్చు. యుఎఇ ఇప్పటికే మరో చమురు పైపు లైన్ నిర్మిస్తోంది. అది పూర్తయితే అబుదాబి నుంచి వచ్చే దాదాపు మొత్తం చమురంతా హర్మూజ్ జలసంధి మీదుగా కాకుండా ఫుజైరా పోర్టు ద్వారా బయటకు తరలించే అవకాశం కలుగుతుంది. అలాగే సౌదీ అరేబియా తన ఈస్ట్ వెస్ట్ పైపు లైన్ మార్గాన్ని విస్తరిస్తోంది. దీని ద్వారా సౌదీ చమురును హర్మూజ్ జలసంధి మీదుగా కాకుండా ఎర్ర సముద్ర తీరం లోని రేవులద్వారా ఎగుమతి చేయవచ్చు. ఇరాక్, జోర్డాన్ కూడా తమ పాత ప్రణాళికలను మళ్లీ ప్రారంభించాయి.ఇందులో భాగంగా రోజుకు 10 లక్షల బ్యారెళ్ల వరకు చమురును ఎర్ర సముద్రంలోని అకాబా పోర్టుకు తరలించే పైప్‌లైన్‌ను నిర్మించాలని భావిస్తున్నాయి. అంతేకాకుండా బాగ్దాద్ మీదుగా మధ్యధరా సముద్రం వరకు వెళ్లే పాత చమురు పైప్‌లైన్‌ను మరమ్మతు చేస్తోంది. ఏదిఏమైనా హర్మూజ్ జలసంధిపై ఇరాన్ శాశ్వత నియంత్రణ సాధించే అవకాశం ఉండకూడదు. ప్రపంచ ఇంధన సరఫరాలను తన ఇష్టానుసారం ఆపివేస్తూ లేదా బెదిరిస్తూ దేశాలను ఒత్తిడికి గురిచేసే పరిస్థితి ఉండకూడదు. అమెరికా ఇరాన్ మధ్య ఉన్న ప్రతిష్ఠంభనకు తక్షణ పరిష్కారం కనిపించకపోవడం, అలాగే ఇజ్రాయెల్ సమస్య కూడా ముగిసే పరిస్థితి లేకపోవడంతో టెల్ అవీవ్ మళ్లీ ఎప్పుడు టెహ్రాన్‌పై దాడులు ప్రారంభిస్తుందో చెప్పలేం.అందువల్ల ప్రపంచ దేశాలు తమ ఇంధన భద్రతను ట్రంప్, నెతన్యాహు లేదా ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ (ఐఆర్‌జిసి) నిర్ణయాలపై ఆధారపడి ఉండలేవు. అంతేకాకుండా చమురు ఉత్పత్తి చేసే ప్రధాన దేశాల వద్ద తమ చమురు ఆదాయాలను భారీగా ఆర్జించుకోవడానికి బహుశా మరో పదేళ్ల సమయం మాత్రమే ఉండవచ్చు. ప్రపంచ ఇంధన వినియోగంలో విద్యుదీకరణ, పునరుత్పాదక ఇంధనాల వాటా, క్రమంగా పెరుగుతున్నందున, పెట్రో డాలర్ల యుగం ముగిసే దశకు చేరుకుంటోంది. అందుకే హర్మూజ్ జలసంధి సమస్యను తగ్గించడానికి పైప్ లైన్లు, చమురు నిల్వ సదుపాయాలు వంటి ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం పెరుగుతోంది. హర్మూజ్ జలసంధిని ఒక వ్యూహాత్మక ఆయుధంగా ఉపయోగించడంలో ఇరాన్ మరీ ఎక్కువగా ముందుకు వెళ్లి ఉండవచ్చు.కానీ త్వరలో హర్మూజ్ ప్రాముఖ్యత ఒక చిన్న అధ్యాయంగా మాత్రమే మిగిలిపోవచ్చు. అమెరికా ఇరాన్ పరస్పర దాడులు ముమ్మరం కావడంతో చమురు ధరలు మళ్లీ పెరగడం ప్రారంభించాయి. మంగళవారం (సెప్టెంబరు 2) బ్రెంట్ క్రూడ్ చమురు ధర బ్యారెల్‌కు సుమారు 92 డాలర్లకు చేరింది. బుధవారం కొంత తగ్గి 91 డాలర్లకు చేరుకుంది. ప్రపంచ ఆర్థిక భౌగోళిక, రాజకీయ సంక్షోభాల ప్రభావంతో సరఫరాలో అవాంతరాలు మొదట ఊహించిన దానికంటే ఎక్కువ కాలం కొనసాగవచ్చని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర కూడా బ్యారెల్‌కు 80 నుంచి 90 డాలర్ల వరకు ఉండవచ్చని, అలా జరిగితే ప్రజలకు రవాణా,

# కఠిన పోరు ప్రారంభం... కానీ రేవంత్ సిద్ధంగా ఉన్నారా?



హైదరాబాద్,తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి పదవి నుండి కొండా సురేఖను తొలగించడం ద్వారా కాంగ్రెస్ అధిష్టానం ఒక కఠిన నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్?హైకమాండ్ ?ఈ కఠిన నిర్ణయం ఎందుకు తీసుకోవలసివచ్చిందో అందరికీ తెలిసిందే. అయితే, కొండా సురేఖ స్వతహాగా పోరాట పటిమ కలిగిన వ్యక్తి కావడం వల్ల, ఆమె ఈ విషయంలో వెనక్కి తగ్గే అవకాశం లేదు. ఇకపై సురేఖ చేసే విమర్శలను అదుపు చేయడం రేవంత్ రెడ్డికి లేదా కాంగ్రెస్ నాయకత్వానికి అంత సులభం కాకపోవచ్చు.ఆమె సంబంధిత వ్యక్తులందరిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడే అవకాశం ఉంది. తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏర్పడి 30 నెలలకు పైగా గడిచింది. ఈ కాలంలో ఆయనకు వ్యతిరేకంగా పెద్దగా రాజకీయ ఉద్యమాలు ఏవీ లేకుండానే పాలన సాగింది. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి, కొండా సురేఖ వంటి వారి నుండి అప్పుడప్పుడు విమర్శలు వచ్చినప్పటికీ, అవి ప్రభుత్వానికి పెద్ద ముప్పుగా పరిణమించలేదు.కానీ సురేఖ నిష్క్రమణ తర్వాత పరిస్థితిలో భారీ మార్పు వచ్చే అవకాశం ఉంది. ఎందుకంటే ఇది కాంగ్రెస్ సీనియర్ నాయకత్వం నుండి బలమైన స్పందనకు దారితీస్తుంది. ఇకపై రేవంత్ రెడ్డిపై తీవ్ర ఒత్తిడి పడటం ఖాయం. అయితే, ఇక్కడ గమనించాల్సిన ముఖ్యమైన విషయం ఏమిటంటే, రేవంత్ రెడ్డి స్వయంగా ఒక పోరాట యోధుడు. ఆయన ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సంసిద్ధంగా ఉంటారు.రేవంత్ రెడ్డికి అనుకూలంగా ఉన్న కీలక అంశాలలో ఒకటి కాంగ్రెస్ అధిష్టానం నుండి లభిస్తున్న అచంచలమైన మద్దతు. తెలంగాణలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో ఆయన పోషించిన పాత్రకు అధిష్టానం అత్యంత ప్రాధాన్యతనిస్తోంది. అంతేకాకుండా, క్షేత్రస్థాయి పరిస్థితులపై రేవంత్‌కు ఉన్న అవగాహన అసాధారణమైనది. కాంగ్రెస్‌లోని అంతర్గత వ్యవహారాలు ఎప్పటికైనా పెద్ద సమస్యగా మారడం అనివార్యం, చివరకు ఇప్పుడు అదే జరిగింది.కాబట్టి, ఇకపై రేవంత్ రెడ్డి దీ=ూ, దీజీూలతోనే కాకుండా, తన సొంత పార్టీ అయిన కాంగ్రెస్ లోపల కూడా అనేక పోరాటాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. కొండా సురేఖ బర్తరఫ్ తర్వాత రేవంత్‌రెడ్డికి అసలు రాజకీయ పరీక్ష కాంగ్రెస్ బయట కంటే పార్టీలోనే ఉండే అవకాశం ఎక్కువ. అయితే దీన్ని వెంటనే "రేవంత్‌పై తిరుగుబాటు మొదలైంది" అని చెప్పడం కూడా తొందరపాటు.ప్రస్తుతం కనిపిస్తున్న సంకేతాలను బట్టి ఇది రేవంత్ నాయకత్వాన్ని మరింత కేంద్రీకరించే దశగా చూడొచ్చు. ఈరోజు కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడంతో పాటు జి. చిన??నారెడ్డిని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ పదవిని కూడా తొలగించారు. ఈ పరిణామం కొన్ని వారాలుగా సాగుతున్న కాంగ్రెస్ అంతర్గత వివాదానికి ముగింపు దశగా కనిపిస్తోంది.

రేవంత్‌కు వ్యతిరేకత పెరిగే అవకాశముందా?

అవకాశం ఉంది. కానీ అది బహిరంగ తిరుగుబాటు రూపంలో వెంటనే బయటకు రావడం కంటే, అంతర్గత అసంతృప్తి రూపంలో ఉండొచ్చు. ఇప్పటికే సురేఖ వ్యవహారంలో రేవంత్‌కు అనుకూలంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, విప్‌లు బహిరంగంగా మాట్లాడారు.ముఖ్యమంత్రి నాయకత్వానికి తాము అండగా ఉంటామని ప్రకటించారు. అంటే ప్రస్తుతం పార్టీ శాసనసభ్యుల్లో రేవంత్‌కు సంఖ్యాబలం పరంగా తక్షణ ముప్పు కనిపించడం లేదు. కానీ మరో కోణం ఉంది. సురేఖ సమస్య కేవలం వ్యక్తిగత వివాదంగా ముగిస్తే రేవంత్‌కు అనుకూలమే. అది "కాంగ్రెస్‌లో సీనియర్ నేతలకు స్థలం లేదా?", "టికెట్ల విషయంలో సీఎం ఒక్కరే నిర్ణయిస్తున్నారా?", "ప్రభుత్వంలో రాజకీయ సమన్వయం తగ్గుతోందా?" అనే పెద్ద చర్చగా మారితే మాత్రం సమస్యే.పరకాల టికెట్‌పై రేవంత్ బహిరంగంగా ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికే మళ్లీ అవకాశం ఉంటుందని చెప్పడం సురేఖ కుటుంబంలో అసంతృప్తికి కారణమైంది. అందువల్ల టికెట్ల పంపిణీ, పదవులు, నియోజకవర్గాలపై ఆధిపత్యం-ఇవే భవిష్యత్తులో కాంగ్రెస్‌లో అసలు ఘర్షణలకు కేంద్రాలుగా మారే అవకాశం ఉంది.

రేవంత్‌కు ఈ బర్తరఫ్ ఒక బలప్రదర్శన కూడా

సురేఖ బర్తరఫ్? అనేది "ప్రభుత్వాన్ని, సీఎంను బహిరంగంగా బలహీనపరిచే రాజకీయాన్ని సహించేది లేదు." అనే స్పష్టమైన సందేశం ఇచ్చినట్టుగా కనిపిస్తోంది. సురేఖ విషయంలో పార్టీ అధిష్ఠానం సురేఖపై కఠిన చర్యకు సిద్ధమైందని వార్తలు రాగానే రేవంత్ కూడా క్రమశిక్షణపై గట్టి చర్య అవసరమని హైకమాండ్‌కు చెప్పినట్లు సమాచారం వచ్చింది.ఇది రేవంత్‌కు ఒక ప్రయోజనం ఇస్తుంది. మిగిలిన మంత్రులు, ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలకు "సరిహద్దు ఇదే" అనే సంకేతం వెళ్తుంది. కానీ ఇక్కడే ప్రమాదం కూడా ఉంది. ఎక్కువగా కఠినంగా వ్యవహరిస్తే-క్రమశిక్షణ ? భయం ? అసంతృప్తి ? వర్గీకరణ అనే చైన్ ఏర్పడే ప్రమాదం ఉంటుంది.

ఇక ముందు రేవంత్ ఎలా వ్యవహరించే అవకాశం ఉంది?

ఒక అంచనా ప్రకారం ఆయన మూడు ట్రాక్‌లలో ముందుకు వెళ్లే అవకాశం ఎక్కువ. మొదటిది: పార్టీపై నియంత్రణ పెంచడం. ఇకపై మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతల బహిరంగ వ్యాఖ్యలపై మరింత కఠినంగా వ్యవహరించే అవకాశం ఉంది.సురేఖపై చర్యకు ముందు కాంగ్రెస్ ఎమ్మెల్యేలే కఠిన చర్య కోరడం కూడా దీనికి రాజకీయ కవచంగా పనిచేసింది. రెండోది: క్యాబినెట్/పార్టీ పునర్వ్యవస్థీకరణ. సురేఖ తొలగింపు ఒక్కటితో ఆగకుండా ఎవరికి ఏ బాధ్యత ఇవ్వాలి, ఎవరిని ముందుకు తీసుకురావాలి, ఎవరిని దూరంగా ఉంచాలి అనే విషయంలో రేవంత్ మరింత జాగ్రత్తగా వ్యవహరించే అవకాశం ఉంది. ఈరోజు సురేఖతో పాటు చిన??నారెడ్డి పదవిపై కూడా మార్పు రావడం ఈ కోణంలో గమనించాల్సిన అంశం.మూడోది: హైకమాండ్‌తో సమన్వయం. ఇది చాలా కీలకం. రేవంత్ తనంతట తానే "నా ప్రభుత్వం-నా నిర్ణయం" అనే శైలిలో ముందుకెళ్తే కాంగ్రెస్‌లోని ప్రత్యర్థి వర్గాలకు అవకాశం వస్తుంది. కాబట్టి ఇక ముందు ప్రతి పెద్ద చర్యకు ఢిల్లీ కాంగ్రెస్ నాయకత్వం మద్దతు ఉందనే భావన కలిగించడం ఆయనకు అవసరం. సురేఖ విషయంలో కూడాూా×జజ స్థాయిలో చర్చ జరిగిన తర్వాతే చర్యకు వెళ్లినట్లు వార్తలు వచ్చాయి.

అసలు రేవంత్‌కు ప్రమాదం ఎక్కడుంది?

కొండా సురేఖ కాదు. రేవంత్‌కు మూడు అంశాలే పెద్ద పరీక్ష: కాంగ్రెస్‌లోని సీనియర్ నేతల అసంతృప్తి, టికెట్ల పంపిణీపై వచ్చే విభేదాలు, 2028 ఎన్నికలకు ముందు ఎమ్మెల్యేలు తమ రాజకీయ భవిష్యత్తుపై ఆందోళన చెందడం. ప్రస్తుతం అధికారంలో ఉన్న సీఎం మీద ఎమ్మెల్యేలు సాధారణంగా బహిరంగంగా తిరగబడరు.కానీ ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ "ఎవరికి టికెట్?", "ఎవరికి ప్రాధాన్యం?", "ఎవరికి మంత్రి పదవి?" అనే ప్రశ్నలు పెరుగుతాయి. అక్కడే రేవంత్ నాయకత్వానికి నిజమైన పరీక్ష మొదలవుతుంది. ప్రస్తుత పరిణామాన్ని రేవంత్ బలహీనతకు సంకేతంగా కాకుండా, ఆయన నాయకత్వాన్ని మరింత కేంద్రీకరించే ప్రయత్నంగా చూడాలి. కానీ అది విజయవంతం కావాలంటే ఒక సంతులనం అవసరం: క్రమశిక్షణలో కఠినం ం రాజకీయంగా సమన్వయం. కఠినంగా మాత్రమే ఉంటే కాంగ్రెస్‌లో అసంతృప్తి పెరగొచ్చు.సమన్వయం మాత్రమే ఉంటే సీఎం నాయకత్వంపై ప్రశ్నలు రావచ్చు. కాబట్టి ఇక ముందు రేవంత్ "ఎవరినైనా తొలగించే సీఎం" కంటే "ఎవరిని తనతో కలుపుకోవాలి, ఎవరిని దూరంగా ఉంచాలి" అనే రాజకీయ నిర్వహణపై ఎక్కువ దృష్టి పెట్టే అవకాశం ఉంది. ముఖ్యంగా కొండా సురేఖ తర్వాత మరే సీనియర్ నేతపై చర్య వస్తుందా? అన్నదే తదుపరి కీలక సంకేతం. అది జరిగితే ఇది వ్యక్తిగత వివాదం కాదని, రేవంత్ కాంగ్రెస్‌లో కొత్త రాజకీయ క్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారని అర్థం చేసుకోవచ్చు.

## కల్తీ నెయ్యి కేసులో డిప్యూటీ ఈవో

తిరుపతి, తిరుమల తిరుపతి దేవస్థానం అధికారుల అవినీతి నెట్‌వర్క్‌పై అవినీతి నిరోధక శాఖ ఉక్కుపాదం మోపింది. తిరుమల శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో మెండు లోకనాథం నివాసం, కార్యాలయం, బంధువుల ఇళ్లపై ఏకకాలంలో దాడులు నిర్వహించిన ఏసీబీ అధికారులు, విచారణ అనంతరం ఆయనను అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నారు. గత రెండు రోజులుగా తిరుపతిలోని పెద్దకాపు లేఅవుట్‌లోని ఆయన ఇల్లు, తిరుమలలోని ఛాంబర్‌తో పాటు ఐదు కీలక ప్రాంతాల్లో సాగిన తనిఖీల తర్వాత ఈ చర్యలు తీసుకున్నారు. లడ్డూ ప్రసాదం నెయ్యి కల్తీ వ్యవహారంపై సీబీఐ జరిపిన దర్యాప్తులో లభించిన కీలక ఆధారాల ఆధారంగా ఏసీబీ ఈ కేసు నమోదు చేసి దాడుల నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టినట్లు వచ్చిన ఆరోపణలతో ఏసీబీ జరిపిన తనిఖీల్లో విస్తుపోయే విషయాలు బయటపడ్డాయి. ప్రాథమికంగా దాదాపు రూ.5 కోట్ల కంటే ఎక్కువ విలువైన అక్రమాస్తులను అధికారులు గుర్తించినట్లు సమాచారం. తిరుపతిలోని పీకే లేఅవుట్‌లో భార్య పేరిట కొనుగోలు చేసిన విలాసవంతమైన భవనంతో పాటు, గొల్లవానిగుంటలో భార్య పేరుపైనే రెండు ప్లాట్లు, మరో భవనం ఉన్నట్లు అధికారులు ఆధారాలు సేకరించారు. అంతేకాకుండా, వడమాలపేట మండలం పడిరేడు అరణ్యం గ్రామంలో ఇంటి స్థలం, తిరుపతి శ్రీనివాస నగర్‌లో కుమారుడి పేరు మీద విలువైన ప్లాట్‌ను కొనుగోలు చేసినట్లు ఏసీబీ రికార్డుల్లో తేలింది.కేవలం స్థిరాస్తులే కాకుండా పెద్ద మొత్తంలో పసిడి, వెండి, నగదును కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఏసీబీ జరిపిన సోదాల్లో 2 కిలోల బంగారం, 6.5 కిలోల వెండితో పాటు రూ. 12.5 లక్షల నగదును దొరికాయి. లోకనాథం తన కుమారుడు , ఇతర బంధువుల పేర్లపై దాదాపు నాలుగు బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసినట్లు అధికారులు గుర్తించారు. వీటికి సంబంధించి రూ. 31.98 లక్షల విలువైన డాక్యుమెంట్లు, ఆస్తి పత్రాలను సైతం అధికారులు స్వాధీనం చేసుకున్నారు.టీటీడీలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ ప్రయాణం ప్రారంభించిన లోకనాథం, వరుస పదోన్నతులతో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో స్థాయికి ఎదిగారు. గత ప్రభుత్వ హయాంలో కూడా అత్యంత కీలక స్థానాల్లో పనిచేసిన ఈయనపై, టీటీడీ చైర్మన్ మాజీ పీఏ చిన్న అప్పన్న కేసుకు ముడిపడి ఉన్న ఆధారాల వెలుగులోనే ఈ దాడులు జరిగాయి. సీబీఐ చేసిన దర్యాప్తులో దొరికిన ఆధారాలతోనే ఈ సోదాలు జరిగాయి. దశాబ్దాల కాలంలో తిరుమలలో ఇంతటి భారీ స్థాయిలో ఉన్నతాధికారిపై ఏసీబీ విరుచుకుపడటం దాదాపు 15 ఏళ్ల తర్వాత ఇదే మొదటిసారి కావడంతో, టీటీడీ వర్గాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది.అరెస్ట్ చేసిన లోకనాథంను తిరుపతి ఏసీబీ కార్యాలయానికి తరలించిన అధికారులు, ఆయనను న్యాయమూర్తి ముందు హాజరుపరిచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ అక్రమాస్తుల వెనుక ఇంకా ఎవరైనా ప్రజాప్రతినిధులు లేదా ఇతర అధికారుల ప్రమేయం ఉందా అన్న కోణంలో ఏసీబీ దర్యాప్తు వేగవంతం చేసింది. బెంగళూరు, ఏర్పేడు తదితర ప్రాంతాల్లో ఉన్న ఆయన అనుచరుల ఇళ్లలోనూ తనిఖీలు ఇంకా కొనసాగుతుండటంతో, రాబోయే రోజుల్లో మరిన్ని అక్రమాస్తుల లెక్కలు బయటపడే అవకాశముంది.

## అమెరికా, కెనడాల నుంచి లండన్‌కు 86 టన్నుల బంగారాన్ని తరలింపు

ముంబై,ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక అనిశ్చితి నేపథ్యంలో నెదర్లాండ్స్ ప్రభుత్వం అత్యంత కీలక నిర్ణయాన్ని అమలు చేసింది. అమెరికా, కెనడా దేశాల్లో నిల్వ ఉంచిన తమ 86 టన్నుల పసిడి నిల్వలను బ్రిటన్ రాజధాని లండన్‌లోని 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్' వాల్ట్‌కు విజయవంతంగా తరలించినట్లు డచ్ సెంట్రల్ బ్యాంక్ అధికారికంగా ధ్రువీకరించింది. సంక్షోభ సమయంలో ఈ పసిడిని అత్యంత వేగంగా ట్రేడింగ్ చేయడానికి, నగదు రూపంలోకి మార్చుకోవడానికి వీలుగానే ఈ క్లిష్టమైన ఆపరేషన్‌ను పూర్తి చేసినట్లు బ్యాంక్ గవర్నర్ ఒలాఫ్ స్లీపెన్ వెల్లడించారు.ఈ భారీ తరలింపు ప్రక్రియను ఈ ఏడాది మార్చి నుంచి ఆగస్టు మధ్య కాలంలో రెండు విభిన్న పద్ధతుల్లో అత్యంత జాగ్రత్తగా నిర్వహించారు. మొదటగా అమెరికా, కెనడాలలోని బ్యాంకుల నుంచి సుమారు 27 టన్నుల భౌతిక (ఫిజికల్) బంగారాన్ని నెదర్లాండ్స్‌లోని జైస్ట్ (జివతిబబి) ప్రాంతానికి తీసుకొచ్చి, అక్కడి నుంచి లండన్‌లోని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్‌కు భద్రంగా చేర్చారు. ఇక మిగిలిన పసిడికి సంబంధించి రవాణా ప్రమాదాలను తగ్గించేందుకు, న్యూయార్క్‌లో ఉన్న గోల్డ్ బార్‌లను అక్కడే విక్రయించి, సమాన పరిమాణంలోని అంతర్జాతీయ ప్రామాణిక బంగారాన్ని తిరిగి లండన్ మార్కెట్‌లో కొనుగోలు చేశారు. ఈ విధానం వల్ల బంగారాన్ని కరిగించాల్సిన అవసరం లేకుండానే, సమర్థవంతంగా లండన్‌కు తరలించడం సాధ్యమైంది.ప్రస్తుతం అమెరికా-కెనడా మధ్య నడుస్తున్న వాణిజ్య పోరు, పశ్చిమాసియాలో ఇరాన్ ఉద్రిక్తతలు, అగ్రరాజ్య ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న ఆందోళనల మధ్య డచ్ బ్యాంక్ ఈ చర్యకు పూనుకోవడం అంతర్జాతీయంగా తీవ్ర ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రపంచంలోనే అతిపెద్ద, అత్యంత లిక్విడిటీ ఉన్న గోల్డ్ మార్కెట్‌గా లండన్ గుర్తింపు పొందింది. లండన్‌లోని 'బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్' అధునాతన బాంబ్-ప్రూఫ్ వాల్ట్‌లలో ప్రపంచ పసిడి నిల్వల్లో దాదాపు ఐదో వంతు భద్రపరచబడి ఉంది. ఇక్కడ వివిధ దేశాల కేటాయింపులు పక్కపక్కనే ఉండటంతో, అత్యవసర సమయాల్లో భౌతికంగా బంగారాన్ని రవాణా చేసే పనిలేకుండా, వాల్ట్‌లోని అరలు మార్చడం ద్వారానే వేల కోట్ల విలువైన అంతర్జాతీయ లావాదేవీలను క్షణాల్లో పూర్తి చేయడానికి వీలవుతుంది.

## ప్రైవేటు విమానయాన సంస్థలో అభినందన్ కొత్త కెరీర్

ముంబై,2019 బాలాకోట్ వైమానిక దాడుల అనంతరం పాకిస్థాన్ ఎఫ్-16 యుద్ధ విమానాన్ని కూల్చివేసి దేశవ్యాప్తంగా హీరోగా నిలిచిన గ్రూప్ కెప్టెన్ మాజీ వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్, భారత వైమానిక దళం నుంచి ఘనంగా రిటైర్మెంట్ తీసుకున్నారు. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా నిబద్ధతతో దేశ రక్షణ రంగంలో అందించిన విశిష్ట సేవలకు ముగింపు పలికి, ఆయన ఇప్పుడు తన కెరీర్‌లో సరికొత్త అధ్యాయాన్ని ప్రారంభించారు. వైమానిక దళం నుంచి వీడ్కోలు పొందిన అనంతరం ఆయన ఒక ప్రముఖ ప్రైవేట్ ఎయిర్‌లైన్స్‌లో కీలక బాధ్యతలు స్వీకరించారు. 2019 ఫిబ్రవరి 27న జరిగిన చారిత్రాత్మక పోరాటంలో అభినందన్ చూపించిన తెగువ భారత మిలిటరీ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించబడింది. పాతతరం మిగ్-21 బైసన్ ఫైటర్ జెట్‌ను నడుపుతూనే, అత్యాధునిక అమెరికన్ మేడ్ పాకిస్థానీ ఎఫ్-16 విమానాన్ని లాక్ చేసి కూల్చివేసారు. ఆ సమయంలో తన విమానం కూడా దెబ్బతినడంతో పాక్ ఆక్రమిత కాశ్మీర్ భూభాగంలో పారాచూట్ ద్వారా దిగాల్సి వచ్చింది. పాకిస్థాన్ ఆర్మీ కస్టడీలో ఉన్నప్పటికీ, ఎలాంటి బె?రింపులకు లొంగకుండా ఆత్మస్థైర్యంతో, ఆర్మీ సమాచారాన్ని బయటపెట్టకుండా నిలబడిన తీరు దేశ ప్రజలందరినీ ముగ్ధులను చేసింది.విశ్వవ్యాప్తంగా దౌత్యపరమైన ఒత్తిడి, భారత ప్రభుత్వ కఠిన వైఖరి కారణంగా పాకిస్థాన్ ప్రభుత్వం 60 గంటల్లోపే అభినందన్‌ను వాఘా సరిహద్దు ద్వారా సురక్షితంగా భారత్‌కు అప్పగించక తప్పలేదు. ఆయన చూపిన అసాధారణ ధైర్యసాహసాలకు గాను భారత ప్రభుత్వం ఆయనకు అత్యున్నత మిలిటరీ పురస్కారం వీరచక్ర తో గౌరవించింది. ఆ తర్వాత ఆయన సైనిక హోదా పెరుగుతూ గ్రూప్ కెప్టెన్ స్థాయికి చేరుకున్నారు. సుదీర్ఘ వైద్య పరీక్షలు, పునరావాసం అనంతరం ఆయన తిరిగి యుద్ధ విమానాలను నడిపి

# కల చెదిరింది...



వరంగల్, మంత్రివర్గం నుంచి కొండా సురేఖను బర్తరఫ్ చేయడంతో తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలు ప్రారంభం కానున్నాయి. రాజీనామా చేసి ఉంటే పార్టీలో పరిస్థితులు మారాకా మంచి రోజులు వస్తాయని అనుకునేవారు. కానీ హైకమండ్ ను సైతం ధిక్కరించడంతో ఉద్వాసన తప్పలేదు. స్వయంగా ముఖ్యమంత్రి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేయడం, పార్టీ క్రమశిక్షణను ఖాతరు చేయకపోవడం వల్లనే ఈ పరిస్థితి వచ్చింది. బర్తరఫ్ తర్వాత ఇక కాంగ్రెస్ గూటిలో ఆత్మాభిమానంతో కొనసాగడం కొండా కుటుంబానికి ఏమాత్రం సాధ్యం కాదనే భావన రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. హైకమాండ్ వద్ద తమ వాదనను వినిపించేందుకు ఢిల్లీకి వెళ్లి ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. క్రమశిక్షణా ఉల్లంఘనను తీవ్రంగా పరిగణించిన ఏఐసీసీ పెద్దలు సైతం వీరి విషయంలో ఎలాంటి ఉపశమనం ఇవ్వడానికి నిరాకరించారు. సంక్షోభం తలెత్తిన ప్రారంభ దశలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కొండా సురేఖ స్వయంగా రాఖీ కట్టి వివాదానికి తెరదించే అవకాశాన్ని అందిపుచ్చుకున్నప్పటికీ, ఆ తర్వాత కూడా ఆమె శైలిలో మార్పు రాలేదు. ఏ దశలోనూ పరిస్థితిని చక్కదిద్దుకునేందుకు, డ్యామేజ్ కంట్రోల్ చేసేందుకు కొండా దంపతులు ప్రయత్నించకపోగా.. రోజురోజుకూ ఘర్షణాత్మక వైఖరిని ప్రదర్శిస్తూ పార్టీ అధినాయకత్వంతోనే తెగతెంపులు చేసుకునే స్థాయికి వివాదాన్ని తెచ్చుకున్నారు.కొండా దంపతుల రాజకీయ గతాన్ని పరిశీలిస్తే ఎక్కడా కూడా రాజీపడే తత్వం వారికి కనిపించదు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనూ, ఆ తర్వాత బీఆర్ఎస్‌లోనూ అధిష్ఠానాలతో విభేదించే బయటకు వచ్చారు. తాజాగా కాంగ్రెస్‌లో కూడా తమ పాత ధోరణినే కొనసాగించి సొంత కాళ్లపై గొడ్డలి వేసుకున్నారు. కేబినెట్ నుంచి తప్పించిన వెంటనే వరంగల్ జిల్లాలో ప్రత్యామ్నాయంగా గుండు సుధారాణి, ఇతర బీసీ నేతలను రేవంత్ రెడ్డి తెరపైకి తీసుకురావడంతో క్షేత్రస్థాయిలోనూ కొండా కుటుంబానికి పట్టు సడలే ప్రమాదం ఏర్పడింది. దీంతో సొంత పార్టీలోనే ఉంటూ రాజకీయంగా మనుగడ సాగించడం వారికి దాదాపు అసాధ్యంగా మారింది. ఈ పరిస్థితుల్లో తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి, వరంగల్ కోటపై పట్టు నిలుపుకోవడానికి కొండా దంపతులు కొత్త రాజకీయ గమ్యాన్ని వెతుక్కోక తప్పని పరిస్థితి ఏర్పడింది. వారి ఎదుట మిగిలి ఉన్న ఏకైక బలమైన ప్రత్యామ్నాయం భారతీయ జనతా పార్టీ మాత్రమే. తెలంగాణలో దూకుడుగా వెళ్తున్న బీజేపీ కూడా ఉమ్మడి వరంగల్‌లో బలమైన మాస్ లీడర్ల కోసం చూస్తున్న వేళ.. కొండా మురళి, సురేఖల చేరిక వైపు అడుగులు పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కాంగ్రెస్‌కు రాంరాం చెప్పి కాషాయ కండువా కప్పుకోవడమే వారి తదుపరి రాజకీయ అస్త్రం అవుతుందన్న చర్చలు జోరందుకున్నాయి

# బొత్స మీద ప్రచారంలో నిజమెంత?



అమరావతి,ఉత్తరాంధ్ర బీసీ నాయకుడిగా, సీనియర్ నేతగా సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉంటూ అనేక పదవులు నిర్వహించిన బొత్స సత్యనారాయణపై ఇటీవల కాలంలో ప్రచారం జోరుగా సాగుతోంది. ఆయన సొంత జిల్లా విజయనగరంలో ఈ ప్రచారం మరింత ఎక్కువగా ఉంది. బొత్స కుటుంబ సమేతంగా వైసీపీని వీడి జనసేనలో చేరిపోతారన్నది ఈ ప్రచారం సారాంశం. బొత్సకు ఈ మేరకు జనసేన అధినాయకత్వం నుంచి సాదరంగా ఆహ్వానం అందిందని కూడా అంటున్నారు. ఇప్పుడే ఈ రకమైన ప్రచారం వ్యాప్తి చెందడానికి కూడా కారణాలు ఉన్నాయని అంటున్నారు. బొత్స కుమార్తె డాక్టర్ అనూష స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయనగరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. ఆమె వైసీపీ నుంచి కాకుండా జనసేన నుంచి బరిలో ఉంటారని కూడా ప్రచారం సాగుతోంది. బొత్స వైసీపీలో కీలక నేత, శాసన మండలిలో ప్రతిపక్ష నేతగా ఉన్నారు. అలాంటి నాయకుడి కుమార్తె జనసేనలో ఎలా చేరుతారని కూడా తర్కించుకుంటున్నారు. అయితే ఆమె ఒక్కరే కాదు.. మొత్తం బంధుమిత్ర సమేతంగా బొత్స వైసీపీని వీడి జనసేన తీర్థం పుచ్చుకోనున్నారని ప్రచారం సాగుతోంది. బొత్స కుటుంబానికి మెగా కుటుంబానికి మధ్య చిరకాలంగా సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా జనసేన బలపడాలని చూస్తోందని అంటున్నారు. జనసేనకు ఉత్తరాంధ్రలో బలమైన నాయకత్వం అవసరం ఉందని, బొత్స రూపంలో అది తీరుతుందని భావిస్తూ ఆయన్ని స్వాగతించారని అంటున్నారు. అయితే ఇవన్నీ పుకార్లుగానే షికారు చేస్తున్నాయి. బొత్స ప్రస్తుతం వైసీపీలో కీలక నేతగా, శాసన మండలిలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నారు. ఆయన కుటుంబం అంతా వైసీపీలోనే ఉంటోంది. గత రెండు ఎన్నికల నుంచి బొత్స కుటుంబానికి పెద్దపీట వేస్తూ అన్ని విధాలుగా పార్టీ సహకరిస్తోందని గుర్తు చేస్తున్నారు. వైసీపీలో అంతా బాగానే ఉన్న వేళ.. బొత్స వైసీపీని వీడి ఎందుకు జనసేనలోకి వెళ్తారన్నది కూడా పార్టీలో తర్కించుకుంటున్నారు. అయితే ఈ పుకార్లపై బొత్స క్యాంప్ వైపు నుంచి ఎలాంటి ఖండన కానీ, వివరణ కానీ రాకపోవడంతో ఈ ప్రచారంపై చర్చ మరింతగా పెరిగిపోతోంది. అలాగే కొత్తగా ఊహాగానాలు వ్యాప్తి చెందుతున్నాయి. తాజాగా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వైసీపీలోని కోటరీని విమర్శిస్తూ విడుదల చేసిన బహిరంగ లేఖలో కూడా ఈ విషయాన్ని ప్రస్తావించడంతో రాజకీయంగా వేడి పెరిగింది. ఉత్తరాంధ్రకు చెందిన ఒక నాయకుడు పార్టీని వీడుతున్నారని ఆ లేఖలో విజయసాయిరెడ్డి ప్రస్తావించింది బొత్స గురించేనా? అన్నది పార్టీలోపలా, బయటా చర్చించుకుంటున్నారు. వీటికి సరైన సమాధానం బొత్స వైపు నుంచి స్పందన రూపంలో వస్తే తప్ప.. ఈ ప్రచారానికి, ఊహాగానాలకు చెక్ పడదని అంటున్నారు.

# దమ్ముంటే నాపై నీ భార్యను పోటీ చేయించు.. హరీష్‌రావుకు కవిత సవాల్?!



తెలంగాణలో ఎలాంటి ఎన్నికలు లేకపోయినప్పటికీ పొలిటికల్ హీట్ కొనసాగుతుంది. నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. సవాళ్లు ప్రతి సవాళ్లతో రాజకీయం ఒక్కసారిగా తీవ్రస్థాయికి చేరింది. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సైతం సవాళ్లతో రాజకీయాన్ని మరింత హీటెక్కిస్తున్నారు. ఇటీవలే నిజామాబాద్ మీటింగ్‌లో తీవ్రస్థాయిలో విరుచుకపడిన కవిత తాజాగా బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు లక్ష్యంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆయనపై అవినీతి ఆరోపణల నుంచి క్షుద్ర పూజల వంటి అసాంఘిక కార్యక్రమాల విమర్శల వరకు కవిత ఎక్కడ తగ్గేదెలా అన్నట్టుగా హరీష్ పై రెచ్చిపోతూనే ఉన్నారు. కేవలం ఇటు రాజకీయ విమర్శలతోనే సరిపెట్టకుండా అటు రాజకీయ పోరాటాల వరకు కవిత హరీష్ ను టార్గెట్ చేస్తూ వస్తున్నారు. వచ్చే ఎన్నికలలో టిఆర్?ఎస్? పార్టీ నుంచి ఆ పార్టీ అధినేత హోదాలో తాను హరీష్ నియోజకవర్గమైన సిద్ధిపేట నుంచి ఎన్నికల బరిలోకి దిగుతానంటూ యుద్ధానికి అంటూ కాలు దువ్వుతున్నారు. సిద్ధిపేటలో హరీష్ ని కాదని అక్కడ ప్రజలు మరో వ్యక్తికి పట్టం కడతారా అంటే దానికి సమాధానం కేసీఆర్ కుమార్తెగా కవితకు తెలిసిన విషయమే. అయినా కూడా కవిత పదేపదే హరీష్ ను ఎందుకు రెచ్చకొడుతున్నారు.? తాజాగా మీడియా ముందుకొచ్చిన కవిత ఈసారి హరీష్ రావు సతీమణి ని కూడా తన రాజకీయంలోకి లాగారు. రాబోయే ఎన్నికల్లో ధైర్యముంటే హరీశ్‌రావు తన భార్యను నాపైన పోటీకి దింపాలని ఓపెన్ ఛాలెంజ్ చేశారు. ఎలాంటి పోటీనైనా ఎదుర్కొనేందుకు తాను సిద్ధమని కవిత చెప్పుకొచ్చారు. హరీశ్ రావు లేదా ఆయన భార్య ఇద్దరిలో ఎవరో ఒకరు తనపై పోటీ చేయాల్సిందేనని కవిత సవాల్ విసిరారు. అవసరమైతే హరీశ్ రావు రాజకీయాల నుంచి తప్పుకుని తన భార్యను రాజకీయాల్లోకి తీసుకురావచ్చునని అన్నారు. గతంలో హరీశ్‌రావుపై పోటీ చేస్తానని చెప్పిన మాట వాస్తవమేనని కవిత గుర్తుచేశారు. అయితే ఇప్పుడు హరీశ్‌రావు భార్య తనపై పోటీచేస్తే స్వాగతిస్తానని స్పష్టం చేశారు. తనపై ఎవరు పోటీ చేసినా ఎదుర్కొనేందుకు సిద్ధమే అన్నారు. అవసరమని భావిస్తే రాజకీయాలను పక్కనపెట్టి ఆయన తన భార్యను బరిలోకి దించవచ్చని...ఆమె తనపై పోటీ చేసినా స్వాగతిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. గతంలో సిద్దిపేట నుంచి హరీశ్‌రావుపై పోటీ చేస్తానని చెప్పిన మాటను గుర్తు చేసిన కవిత వచ్చే ఎన్నికల్లో తాను సిద్దిపేట లేదా బోధన్ నియోజకవర్గాల నుంచి పోటీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు పరోక్ష సంకేతాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపైనా కవిత తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వ నిర్ణయాలు, ముఖ్యమంత్రి ప్రకటనల మధ్య పొంతన కనిపించడం లేదని మండిపడ్డారు. ఇకపై రేవంత్‌రెడ్డి చర్యలను తుగ్లక్ చర్యలు అని చెప్పాల్సిన అవసరం లేదని... రేవంత్‌రెడ్డిలా ఉన్నావ్ అంటే సరిపోతుందని సెటైర్లు వేశారు. తెలంగాణకు ముఖ్యమంత్రి కావాలని తనకు ఉందని తన మనసులో మాట బయటపెట్టారు కవిత.

### కవిత వ్యాఖ్యలకు కారణం రాజకీయ విభేదాలే

కవిత తాజా సవాల్? వెనుక మరో పెద్ద అంశం కవిత--హరీశ్‌రావు మధ్య పెరిగిన రాజకీయ పోరు. ఇటీవల కవిత హరీశ్‌రావుపై బీఆర్ఎస్‌ను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని, పార్టీపై పట్టు సాధించాలని చూస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. అయితే ఇవి కవిత చేసిన రాజకీయ ఆరోపణలు. వాటిని నిర్ధారిత వాస్తవాలుగా చూడకూడదు. రాజకీయ విశ్లేషణల ప్రకారం... హరీశ్‌రావును లక్ష్యంగా చేసుకోవడం ద్వారా ఆయనపై బీఆర్ఎస్ శ్రేణుల్లో అనుమానాలు పెంచడం, తనకంటూ ప్రత్యేక రాజకీయ స్థానం ఏర్పరచుకోవడం కూడా కవిత

# కూతురి మేయర్ పీఠం కోసం చిన్న శ్రీను ఆరాటం.. !



అమరావతి,ఉత్తరాంధ్ర రాజకీయాల్లో చక్రం తిప్పుతున్న విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అలియాస్ చిన్న శ్రీను రాజకీయ అడుగులపై రోజుకో ఆసక్తికర మలుపు చోటుచేసుకుంటోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో జిల్లా అధ్యక్ష పదవి, భీమిలి నియోజకవర్గ బాధ్యతలు, జడ్పీ చైర్మన్ హోదా ఉన్నప్పటికీ.. తన కుమార్తె సిరి సహస్రను రాబోయే ఎన్నికల్లో విజయనగరం నగర మేయర్ పీఠంపై కూర్చోబెట్టడమే లక్ష్యంగా ఆయన జనసేన పార్టీ వైపు చూస్తున్నారన్న ప్రచారం కలకలం రేపుతోంది. అయితే ఈ చేరికకు జనసేన నాయకత్వం పెట్టిన కండిషన్ ఇప్పుడు చిన్న శ్రీనుకు పెద్ద చిక్కు తెచ్చిపెట్టింది. సీనియర్ నేత బొత్స సత్యనారాయణను కూడా జనసేనలోకి తీసుకువస్తేనే ఎంట్రీ ఉంటుందని జనసేన పెద్దలు షరతు విధించినట్లు సమాచారం. తనతో పాటు రావాలని మజ్జి శ్రీను కోరగా.. తన జీవితం వైసీపీకే అంకితమని బొత్స తెగేసి చెప్పడంతో ఈ పంచాయితీ వైసీపీ అధిష్టానానికి చేరింది. ఈ పరిణామాల నడుమ సెప్టెంబర్ 5న తన పుట్టినరోజు వేదికగా బలప్రదర్శన నిర్వహించి, తన వ్యక్తిగత కేడర్ బలాన్ని అటు వైసీపీకి, ఇటు జనసేనకు చాటిచెప్పేందుకు మజ్జి శ్రీను వేసిన ఎత్తుగడ వేసినట్లుగా జిల్లా ప్రజలు చర్చించుకుంటున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో సంస్థాగతంగా బలమైన నేతగా పేరొందిన జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు రాజకీయ వ్యూహాలు రోజుకో కొత్త మలుపు తిరుగుతున్నాయి. తన రాజకీయ ఉనికిని కాపాడుకుంటూనే, కుటుంబ వారసత్వాన్ని అధికారంలో నిలబెట్టేందుకు ఆయన వేస్తున్న అడుగులు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. మజ్జి శ్రీనివాసరావు తన కుమార్తె సిరి సహస్రను క్రియాశీల రాజకీయాల్లోకి తీసుకువచ్చేందుకు గ్రౌండ్ సిద్ధం చేసుకుంటున్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయనగరం నగర పాలక సంస్థ మేయర్ పీఠాన్ని ఆమెకు కట్టబెట్టాలన్నదే ఆయనలో కనిపిస్తోంది. వైసీపీ అధిష్టానం చిన్న శ్రీనుకు తిరుగులేని ప్రాధాన్యతను ఇచ్చింది. జిల్లా పార్టీ సారథ్యంతో పాటు భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా అగ్రతాంబూలం కల్పించింది. అయినప్పటికీ, విపక్షంలో ఉండి మేయర్ పీఠాన్ని సాధించడం కష్టమన్న అంచనాతో అధికార కూటమిలోని జనసేన వైపు ఆయన మొగ్గు చూపుతున్నారు. జనసేన పార్టీ పెద్దలతో మజ్జి శ్రీను సంప్రదింపులు జరపగా.. వారు షరతులు విధించినట్లు సమాచారం. సీనియర్ నేత, మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణను కూడా పార్టీలోకి తీసుకువస్తేనే చేరికకు పచ్చజెండా ఊపుతామని జనసేన నాయకత్వం స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. జనసేన పెట్టిన షరతుతో మజ్జి శ్రీను స్వయంగా బొత్స సత్యనారాయణను సంప్రదించి పార్టీ మారాలని కోరినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే బొత్స సత్యనారాయణ ఆ ప్రతిపాదనను ముఖం మీదే తిరస్కరించారని సమాచారం. తాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని, తన జీవితం వైసీపీకే అంకితమని బొత్స స్పష్టం చేయడంతో వ్యవహారం తలకిందులైంది. ఈ పరిణామాలు, పార్టీ మార్పు ప్రయత్నాలు నేరుగా తాడేపల్లిలోని వైసీపీ పెద్దల వద్దకు చేరాయి. దీంతో పార్టీలో ఇరకాటం తలెత్తిన నేపథ్యంలో.. తన నిర్ణయం వెనక్కి తగ్గకుండా, తాను ఎంత బలంగా ఉన్నానో నిరూపించుకునేందుకు సెప్టెంబర్ 5న రానున్న తన పుట్టినరోజును చిన్న శ్రీను వేదికగా ఎంచుకున్నారు. విజయనగరంలో భారీ కటౌట్లు, రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాల పేరుతో సెప్టెంబర్ 5న అపూర్వ బలప్రదర్శన చేయాలని మజ్జి శ్రీను నిర్ణయించుకున్నారు. తరలివచ్చే వేలాది మంది జనాన్ని చూపి.. ఇది పార్టీ బలం కాదు, నా స్వంత వ్యక్తిగత బలం, నా బలగం అని చాటిచెప్పేలా ప్లాన్ సిద్ధం చేశారు. పుట్టినరోజు వేడుకలను సక్సెస్ చేసేందుకు స్వయంగా రంగంలోకి దిగిన కుమార్తె సిరి సహస్ర వైఖరిపై స్థానిక నాయకత్వంలో అసంతృప్తి వ్యక్తమవుతోంది. నాన్న బర్త్‌డేకి భారీగా జనాలను తరలించాల్సిందేనంటూ ద్వితీయ శ్రేణి నేతలు, కార్యకర్తలకు ఆమె స్వయంగా ఫోన్లు చేసి ఆదేశాలు జారీ చేస్తుండటాన్ని పలువురు నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. పార్టీలో ఎలాంటి అధికారిక పదవి లేని సమయంలోనే సిరి సహస్ర తమపై ఇలా పెత్తనం చెలాయించడం ఏంటని స్థానిక నాయకులు, సీనియర్ కార్యకర్తలు అంతర్గతంగా మండిపడుతున్నారు. పార్టీ క్రమశిక్షణను కాదని, వ్యక్తిగత రాజకీయాల కోసం తమను పావులుగా వాడుకుంటున్నారన్న భావన వారిలో వ్యక్తమవుతోంది. పుట్టినరోజుకు వచ్చే కేడర్ బలాన్ని అటు వైసీపీకి, ఇటు జనసేనకు చూపించి తన డిమాండ్‌ను పెంచుకోవాలన్నదే చిన్న శ్రీను ప్రధాన ఎత్తుగడగా కనిపిస్తోంది. బొత్స సత్యనారాయణ మద్దతు లేకుండా, కేవలం కుమార్తె మేయర్ పదవి ఆకాంక్షే కాదు.. రాజకీయంగా కూడా మజ్జి శ్రీనివాసరావు రాజకీయ జీవితం కూడా బీటలు వారే అవకాశం ఉంది. కూతరు పదవి కోసం మజ్జి తీసుకుంటున్న నిర్ణయాలతో తన పొలిటికల్ కెరియర్ కు ఫుల్ స్టాఫ్ పడినట్టే.!

### అక్రమ ఇసుక రవాణా..మూడు ట్రాక్టర్లు పట్టివేత

కరీంనగర్:ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను కరీంనగర్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. పెట్రోలింగ్‌లో భాగంగా దుర్శేడు వైపు నుంచి కరీంనగర్‌కు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను తనిఖీ చేయగా, చేగుర్తి ప్రాంతంలోని ఇసుక బాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. దీంతో మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి తెలిపారు. అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై కఠిన

# మూడు పోస్టులతో కొండా సురేఖ లోటు భర్తీ అవుతుందా.?



హైదరాబాద్, కొండా సురేఖను క్యాబినెట్ నుంచి తప్పించారు. అంతకంటే ముందు ఆమె బీసీ కార్డును తెరపైకి తెచ్చారు. తన పద్మశాలి. తన భర్త మున్నూరు కాపు. మొత్తం 16శాతం ఓటు బ్యాంకు అంటు చెప్పుకొచ్చారు. దీంతో అలర్ట్ అయిన కాంగ్రెస్ పెద్దలు బీసీ కార్డుతో తమకు ఎక్కడ నష్టం జరుగుతుందోనని అదే బీసీ వ్యూహంతో..ముగ్గురు బీసీ మహిళలకు కీలక పదవులు ఇచ్చారు. కానీ..డ్యామేజ్ కంట్రోల్ కోసం వేసిన ఈ ప్లాన్..ఇప్పుడు కాంగ్రెస్‌కే బూమరాంగ్ అవుతోందనే గుసగుసలు వినిపిస్తున్నాయి.పదవులు పంచినా.. సురేఖ లోటు భర్తీ కాలేదన్న చర్చ ఒకవైపు.. కొత్తగా పదవులు దక్కిన నేతల విషయంలో పార్టీలోనే అసంతృప్తి మరోవైపు తెరపైకి రావడంతో హస్తం పార్టీ పెద్దల లెక్క తప్పిందన్న టాక్ నడుస్తోంది. సురేఖ స్థానంలో మరో మహిళా నేతను క్యాబినెట్‌లోకి తీసుకోకుండా..బీసీ మహిళలకు మూడు పోస్టులు ఇవ్వడం కట్టబెట్టడం అసంతృప్తులకు దారితీసిందని అంటున్నారు.గద్వాల విజయలక్ష్మికి ప్లానింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ పోస్ట్ కట్టబెట్టడం కాంగ్రెస్‌లో ఇంటర్నల్ డిస్కషన్‌కు కారణమవుతుందట. బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రేటర్ హైదరాబాద్ మేయర్‌గా పనిచేసిన విజయలక్ష్మి..ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. మేయర్ పదవి అలా ముగిసిందో లేదో..మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ పదవి వచ్చింది. అప్పటికే ఆ పోస్ట్‌లో ఉన్న నేరెళ్ల శారదకు పొడగింపు ఇవ్వకుండా.. ఆమెను గద్వాల విజయలక్ష్మికి ఉమెన్ కమిషన్ ఛైర్ పర్సన్ పదవిని కట్టబెట్టారు. సీనియర్ నేత అయిన చిన్నారెడ్డిని తప్పించి.. ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్‌పర్సన్‌గా విజయలక్ష్మికి కొత్త బాధ్యతలు ఇచ్చారు.విజయలక్ష్మి స్థానంలో మళ్లీ నేరెళ్ల శారదకు మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ పదవి అప్పగించడం కూడా చర్చకు దారితీస్తోంది. ఏదో పేరుకే పోస్ట్ ఇచ్చినట్లే కానీ.. అప్పుడు రెన్యూవల్ చేయకుండా.. మళ్లీ అదే పోస్ట్‌ను అటుఇటు ఇప్పి తనకు ఇవ్వడంపై నేరెళ్ల శారద కూడా సంతృప్తిగా లేరని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇక గద్వాల విజయలక్ష్మికి ఇప్పుడిచ్చిన ప్లానింగ్ కమిషన్ వైస్ ఛైర్మన్ పోస్ట్ క్యాబినెట్ ర్యాంక్ హోదా కలిగి ఉంటుంది. ఆమె తండ్రి కే కేశవరరావు ఆల్రెడీ ప్రభుత్వ సలహాదారుగా క్యాబినెట్ ర్యాంకు పోస్టులో ఉన్నారు. ఇలా కేకే కుటుంబానికి వరుసగా కీలక పదవులు దక్కడంపై కాంగ్రెస్‌లో మరో చర్చ మొదలైందట. పార్టీ కోసం ఏళ్ల తరబడి పనిచేసిన సీనియర్లు ఉండగా..అవసరాల కోసం పక్కదారులు చూసి మళ్లీ పార్టీలోకి వచ్చిన వారికి పెద్దపెద్ద పోస్టులు కట్టబెట్టడం ఏంటంటూ గునుక్కుంటున్నారట పలువురు హస్తం పార్టీ నేతలు. ఇక గుండు సుధారాణి కుడా ఛైర్‌పర్సన్‌గా అవకాశం ఇవ్వడం కూడా హస్తం పార్టీలో కుతకుత దారితీసిందని అంటున్నారు. గుండు సుధారాణి గతంలో టీడీపీలో రాజ్యసభ సభ్యురాలిగా పనిచేశారు. ఆ తర్వాత బీఆర్ఎస్‌లో చేరి వరంగల్ మేయర్ పదవి దక్కించుకున్నారు. బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఉండి..కాంగ్రెస్ గూటికి చేరారు. కొండా సురేఖను తప్పించడం ద్వారా డ్యామేజ్ జరగకుండా..అదే వరంగల్ జిల్లాకు చెందిన పద్మశాలి వర్గానికి చెందిన గుండు సుధారాణికి కుడా ఛైర్‌పర్సన్ పదవి కట్టబెట్టారని గుసగుసలు పెట్టుకుంటున్నారు. క్యాస్ట్ ఈక్వేషన్స్‌ను బ్యాలెన్స్ చేసేందుకు..పార్టీ కోసం ఏం పనిచేయకున్నా పదవులు ఇస్తారా అంటూ రగిలిపోతున్నారట పలువురు మహిళా కాంగ్రెస్ నేతలు. కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన తమ పరిస్థితి ఏంటంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. బీసీలకు నెగెటివ్ మెసేజ్ వెళ్లకుండా.. సురేఖను తప్పించి ముగ్గురికి మూడు పదవులు ఇవ్వడం..ప్లస్ పాయింట్‌గా మారకపోగా బూమరాంగ్ అయిందన్న టాక్ వినిపిస్తోంది. సురేఖ అసంతృప్తి ఒకవైపు..సీనియర్ కాంగ్రెస్ నేతల నిట్టూర్పు మరోవైపు..విజయలక్ష్మికి వరుస పదవులపై చర్చ ఇంకోవైపు..ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యతపై మరో వాదన. డ్యామేజ్ కంట్రోల్ కోసం వేసిన స్కెచ్ కాస్త మిస్ ఫైర్ అవుతుందన్న చర్చ నడుస్తోంది.సురేఖ ప్లేస్‌లో ముగ్గురు మహిళలకు నామినేటెడ్ పోస్టులతో సరిపెట్టాలనుకున్న ప్లాన్‌కు పాజిటివ్ రెస్పాన్స్ రాకపోవడంతో..క్యాబినెట్‌లోకి బీసీ మహిళను తీసుకునే ఆలోచన తెరమీదకు వచ్చిందంటున్నారు. ఈ క్రమంలోనే ఎమ్మెల్సీ విజయశాంతి పేరు ప్రచారంలోకి వస్తోంది. సురేఖను తప్పించారు కాబట్టి..ఆమె స్థానంలో మరో మహిళా నేతను మంత్రివర్గంలోకి తీసుకుంటే..కొంతవరకు బ్యాలెన్స్ అవుతుందన్న చర్చ జరుగుతోందట. మూడు బెర్తుల లెక్క కుదరలేదా.? డ్యామేజ్ కంట్రోల్ కోసం వేసిన ప్లాన్ వర్కౌట్ అయిందా కాలేదా అనేది రాబోయే రోజుల్లో మరింత క్లారిటీ కానుంది.

# బీజేపీ చీఫ్ బరిలోకి దిగుతారా ?!



హైదరాబాద్,తెలంగాణలోని హైదరాబాద్ - రంగారెడ్డి - మహబూబ్ నగర్ పట్టభద్రుల నియోజకవర్గం, వరంగల్ - ఖమ్మం - నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గాల ఎమ్మెల్సీల పదవీకాలం వచ్చే 2027 మార్చితో ముగియనుంది. తీన్మార్ మల్లన్న ఆలియాస్ చింతపండు నవీన్, సురభి వాణీదేవిలు అక్కడి నుండి తిరిగి పోటీ చేసే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో బీజేపీ తరపున ఎవరు పోటీ చేస్తారు అన్న చర్చ జోరుగా సాగుతోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు బరిలోకి దిగక తప్పదా అన్న చర్చ జరుగుతోంది. 2015లో హైదరాబాద్ - రంగారెడ్డి - మహబూబ్ నగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుండి పోటీ చేసిన ఎన్. రామచందర్ రావు బీఆర్ఎస్ అభ్యర్థి దేవీప్రసాదరావుపై 13,318 ఓట్లతో విజయం సాధించాడు. ఈ ఎన్నికల్లో ఆయన 53,881 ఓట్లు సాధించాడు. దేవీ ప్రసాద్ రావుకు 40,563 ఓట్లు వచ్చాయి. 2021 నుండి అదే సిట్టింగ్ స్థానం నుండి పోటీ చేసిన ఎన్. రామచందర్ రావు బీఆర్ఎస్ అభ్యర్థి, దివంగత ప్రధానమంత్రి పీవీ నర్సింహారావు కూతురు సురభి వాణీదేవి చేతిలో 11,703 ఓట్ల తేడాతో ఓడిపోయారు. గత అనుభవం నేపథ్యంలో ఈ సారి ఈ స్థానం నుండి ఎన్. రామచందర్ రావునే బరిలోకి దించడం సముచితం అని బీజేపీ భావిస్తుంది. 2023 శాసనసభ ఎన్నికల్లో 8 ఎమ్మెల్యే సీట్లు, 2024 లోక్ సభ ఎన్నికల్లో ఎనిమిది ఎంపీ సీట్లు బీజేపీ గెలిచింది. 2025లో ఉత్తర్ తెలంగాణలో పట్టభద్రుల, ఉపాధ్యాయుల సీట్లలో గెలిచిన బీజేపీ కరీంనగర్ కార్పొరేషన్, స్థానిక సంస్థల ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ పట్టభద్రులలో బీజేపీకి మద్దతు పెరిగిందని భావిస్తున్నారు. బీజేపీ అధ్యక్షుడు మాత్రమే కాకుండా, మాజీ ఎమ్మెల్సీ కావడంతో ఆయనను బరిలోకి దింపితే పార్టీ యంత్రాంగం పూర్తి స్థాయిలో పనిచేస్తుందని భావిస్తున్నారు. 2028లో తెలంగాణలో అధికారంలోకి రావడమే లక్ష్యం అంటున్న బీజేపీకి వచ్చే మార్చిలో జరిగే రెండు పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికలు కీలకం అని చెప్పాలి. ఎనిమిది మంది ఎంపీలు, ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్న బీజేపీ, గత పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలోని 56 శాసనసభ నియోజకవర్గాల్లో ప్రభావం చూపింది. అది తాత్కాలికం కాదు బీజేపీ బలానికి సూచిక అని నిరూపించాలంటే బీజేపీకి ఇక్కడ గెలుపు ముఖ్యం. అధిష్ఠానం ఆదేశిస్తే పోటీకి సిద్ధం అని ఎన్. రామచందర్ రావు చెబుతున్న నేపథ్యంలో బీజేపీ జాతీయ నాయకత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140